


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX








ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 269 | గురువారం 08 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3


## పోరాటం ఆగదన్న రేవంత్ రెడ్డి..

- ఢిల్లీలో రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఘటనను తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- రాహుల్‌ను కలిసేందుకు యత్నించిన రేవంత్‌ను అడ్డుకున్న పోలీసులు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఈసీని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపణ



## నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా

- తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ
- తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని వెల్లడి
- 'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం
- ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం
- భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం



## 25 ఏళ్లలో భారత్ దిశ మార్చారు..

ప్రజల విశ్వాసమే మోదీ బలమన్న సీఎం చంద్రబాబు

భారత్ మౌలిక వసతుల్లో వేగంగా ముందుకెళ్లిందని వెల్లడి

టెక్నాలజీ వినియోగంపై మోదీకి కితాబు

అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహమని వెల్లడి

ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరిగిందని వ్యాఖ్య

'వికసిత్ భారత్ 2047'పై చంద్రబాబు విశ్వాసం



ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ పదవిలో కొనసాగడం అసాధారణ ప్రయాణమని ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజల విశ్వాసమే ఆయన నాయకత్వానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. 2026 అక్టోబర్ 7తో మోదీ ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'ది హిందూ'లో రాసిన వ్యాసంలో చంద్రబాబు

## సుప్రీం తలుపు తట్టిన వైసీపీ..
## కౌంటర్ ఇచ్చిన ఏపీ ప్రభుత్వం!



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై న్యాయపోరాటం పీక్ స్టేజ్‌కు చేరింది. కొత్తగా చేపడుతున్న సవరించిన ఓటర్ల జాబితా (సర్) ప్రక్రియ సంపూర్ణంగా ముగియకుండానే, పాత ఓటర్ల జాబితా ఆధారంగా స్థానిక ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడంపై వైఎస్సార్‌సీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ఈ మేరకు ఏపీ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా సవరణతో పాటు స్థానిక సంస్థల్లో వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియను కూడా పూర్తి చేయాలని వైసీపీ కోరుతోంది. ఈ రెండు ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. కొత్తగా ఓటర్లుగా నమోదయ్యే అర్హులకు ఎన్నికల్లో పాల్గొనే అవకాశం

## యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్..

రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!



బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ

గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి

జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం



## పాతికేళ్ల ప్రజా ప్రస్థానం..

## ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

- 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం
- భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస
- దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు
- దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తమన్నా



- కుటుంబ సభ్యులతో కలిసి సుప్రభాత సేవలో పాల్గొన్న తమన్నా
- ఈ దర్శనం ఎంతో తృప్తిగా, ప్రత్యేకంగా అనిపించిందని వ్యాఖ్య
- ప్రస్తుతం హిందీ, తమిళ చిత్రాలపై దృష్టి పెట్టిన తమన్నా

## దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు..



- రాష్ట్రంలోని వివిధ జోన్ల నుంచి వేల సంఖ్యలో సర్వీసుల ఏర్పాటు
- ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సవరించిన టికెట్ ధరలు అమలు
- అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం

## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం



కుప్పం, శ్రీకాకుళం విమానాశ్రయాలకు భూసేకరణ పూర్తయిందన్న రామ్మోహన్ నాయుడు

భోగాపురం ఎయిర్‌పోర్టుతో పారిశ్రామికంగా ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ధీమా

## డ్రగ్స్‌పై యుద్ధం..

## సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్



- ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కార్యాచరణ
- 'ఆపరేషన్ చైతన్యం', 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమాల విస్తరణకు ఆదేశం
- డ్రగ్స్ నివారణపై సమన్వయం కోసం త్వరలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్
- అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయి పర్యటనలు
- గంజాయి రవాణాపై ఉక్కుపాదం, సరిహద్దుల్లో నిఘా పటిష్ఠం

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. డ్రగ్స్ నిర్మూలనపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఉండవల్లిలో జరిగిన మంత్రుల బృందం సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మంత్రుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, యువతను, విద్యార్థులను డ్రగ్స్ మహమ్మారి బారి నుంచి కాపాడేందుకు బహుముఖ వ్యూహంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 'ఈగల్ క్లబ్'లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో 'ఆపరేషన్ చైతన్యం', విద్యాసంస్థల సమీపంలో 'సేఫ్ క్యాంపస్ జోన్', యువత కోసం 'డ్రగ్స్ వద్దు బ్రో' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీలు, కాలేజీల్లో విద్యార్థులతో నెలకోసారి

## ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన.. పోలీసులు కిందపడేశారన్న ప్రియాంకగాంధీ



ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీల నిరసన

రాహుల్, ప్రియాంక సహా పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్

రోడ్డుపై పడుకుని నిరసన తెలిపిన ప్రియాంక గాంధీ

మహిళా పోలీసులు తనను తోసేశారని ప్రియాంక ఆరోపణ

## డ్రగ్స్‌పై యుద్ధం.. సమష్టిగా కదులుదామన్న మంత్రి లోకేశ్

టౌన్ హాల్ సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ నివారణపై ఇతర రాష్ట్రాలతో సమన్వయం కోసం త్వరలో విశాఖపట్నంలో దక్షిణాది రాష్ట్రాల కాంక్లేవ్ నిర్వహించాలని, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణలో పంజాబ్ పోలీసుల అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ఒడిశా నుంచి గంజాయి రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘాను పటిష్ఠం చేశామని, డ్రోన్ల వినియోగాన్ని కూడా పెంచుతామని తెలిపారు. సమాజంలో చైతన్యం తెచ్చేందుకు 'బ్రేక్ ద సైలెన్స్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చినట్లు గుర్తించామని, ఆయా రాష్ట్రాల అధికారులను అప్రమత్తం చేశామన్నారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తున్న 20 మెడికల్ షాపులను సీజ్ చేశామని, విజయవాడ, రాజమండ్రి నగరాల్లోని బ్లేడ్ బ్యాచ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. డ్రగ్స్ రవాణాను గుర్తించేందుకు 36 శిక్షణ పొందిన జాగిలాలను వినియోగిస్తున్నామని, రాపిడ్ డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 192 మంది పాత నేరస్థులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, ఇంటిలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్..

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు.ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

## దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు..

దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికులు తమ స్వగ్రామాలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు బుధవారం ప్రకటించింది.సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, కరీంనగర్ జోన్ పరిధిలో అత్యధికంగా 3,533 బస్సులు (ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678) నడపనున్నారు. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు (మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440), గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తుండగా, తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్‌ఆర్టీసీ ఒక నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడి ముందస్తుగా బుక్ చేసుకుంటే, వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టికెట్ ధరలను సవరించినట్లు టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

## ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్‌లో చైనా గూఢచారులు.. మాజీ పరిశోధకుడి సంచలన ఆరోపణలు

అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో సంచలన ఆరోపణలు తెరపైకి వచ్చాయి. చైనాకు చెందిన గూఢచారులు ఇప్పటికే అమెరికా ప్రముఖ ఏఐ సంస్థలు ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్‌లోకి చొరబడ్డారని మాజీ పరిశోధకుడు జాకబ్ కాక్సన్ ఆరోపించారు. ఈ విషయం 90 శాతం నిజమని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. అమెరికన్ వ్యాపారవేత్త ప్యాట్రిక్ బెట్-డేవిడ్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో కాక్సన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై ఎంత నమ్మకం ఉందని అడగ్గా.. "90 శాతం నమ్మకంగా ఉన్నాను" అని స్పష్టం చేశారు. కాక్సన్ గతంలో ఓపెన్‌ఏఐ, ఆ తర్వాత ఆంత్రోపిక్‌లో పరిశోధకుడిగా పనిచేశారు. ఏఐ అభివృద్ధి అత్యంత వేగంగా సాగడం మానవాళి భవిష్యత్తుకే ముప్పుగా మారొచ్చంటూ ఇటీవల ఆందోళన వ్యక్తం చేసి ఆంత్రోపిక్‌కు రాజీనామా చేశారు. అమెరికా ఏఐ సంస్థల్లో చైనాకు అనుకూలమైన వ్యక్తులకు అంతర్గత సమాచారం అందుబాటులో ఉంటే.. కీలక మోడళ్లను రహస్యంగా బయటకు తరలించే అవకాశం ఉందని కాక్సన్ హెచ్చరించారు. అమెరికా సాంకేతిక ఆధిక్యాన్ని చైనా ఎప్పుడైనా దెబ్బతీయగలదని పేర్కొన్నారు. అమెరికా ఏఐ రంగంలో విదేశీ గూఢచర్యంపై ఆందోళనలు ఇప్పటికే ఉన్నాయి. చైనా సంస్థలు అమెరికా అభివృద్ధి చేసిన ఏఐ మోడళ్లను 'డిస్టిలేషన్' పద్ధతిలో అనుకరిస్తున్నాయనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఇందులో పెద్ద ఏఐ మోడల్‌ను 'టీచర్'గా ఉపయోగించి చిన్న మోడల్‌కు శిక్షణ ఇస్తారు. అమెరికా రక్షణ సంస్థల్లో విదేశీ ఉద్యోగులపై కఠినమైన భద్రతా తనిఖీలు ఉంటాయని కాక్సన్ చెప్పారు. కానీ సిలికాన్ వ్యాలీలోని ఏఐ సంస్థల్లో ఇలాంటి తనిఖీలు తక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ఉద్యోగుల నియామకంలో రక్షణ రంగ స్థాయి భద్రతా నిబంధనలు తీసుకురావాలని సూచించారు. అమెరికా-చైనా మధ్య ఏఐ పోటీ మరింత వేడెక్కుతోంది. సెప్టెంబరులో చైనాకు చెందిన 10 ప్రముఖ ఏఐ సంస్థలు 16 మోడళ్లను విడుదల చేసినట్లు నిక్కీ లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో అమెరికా ప్రముఖ ఏఐ సంస్థలు 10-12 కొత్త మోడళ్లు, వేరియంట్లు, ప్రత్యేక రీజనింగ్ మోడళ్లను విడుదల చేశాయి.

## రైతన్న అరచేతిలో పరిష్కారం

వ్యవసాయ విస్తరణ అధికారి నుంచి కమిషనరేట్ స్థాయి అధికారుల వరకు రైతులకు ఇప్పటికే వ్యవసాయ విస్తరణ సేవలు అందుతున్నాయి. వీటికి అదనంగా, రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం అరచేతిలోని మొబైల్ ఫోన్ ద్వారానే సలహాలు పొందేందుకు వీలుగా కిసాన్ హెల్ప్‌లైన్ సెంటర్ మరో ముందడుగుగా నిలుస్తోంది. పంటకు తెగులు సోకినా, ఎరువు ఎంత వేయాలో తెలియకపోయినా, ప్రభుత్వ పథకం అందకపోయినా రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1800-180-1551 కు ఫోన్ చేస్తే చాలు. తెలుగులోనే తక్షణ సలహా, సమాచారం అందుతాయి. సేవలు ప్రతిరోజూ ఉదయం 6:00 గంటల నుంచి రాత్రి 10:00 గంటల వరకు, వారంలో 7 రోజులూ అందుబాటులో ఉంటాయి. కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2004 నుంచి దేశవ్యాప్తంగా అమలవుతున్న ఈ కేంద్రం, తెలంగాణ రైతుల కోసం హైదరాబాద్లోని వ్యవసాయ కమిషనర్ మరియు సంచాలకుల కార్యాలయంలో పనిచేస్తోంది. సలహాలతో పాటు, వ్యవసాయ పథకాలకు సంబంధించిన రైతుల ఫిర్యాదులను కూడా ఇదే నంబర్ ద్వారా తెలియజేయవచ్చు. "రైతుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" ఇదే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉండగా, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో కేంద్రం సహాయపడుతుంది. ఈ సేవలు మారుమూల గ్రామాల్లోని ప్రతి రైతుకూ తెలిసేలా, క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని, రైతులు తమ సందేహాల నివృత్తికి, సమస్యల పరిష్కారానికి ఈ టోల్ ఫ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐ.ఏ.ఎస్ సూచించారు.

## ఏపీలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయబోతున్నాం: రామ్మోహన్ నాయుడు

ఏపీలో కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం, కుప్పం, నాగార్జున సాగర్ సమీపంలో, అమరావతి వంటి ప్రాంతాల్లో ఈ నూతన విమానాశ్రయాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటికే శ్రీకాకుళం, కుప్పం ఎయిర్‌పోర్టులకు భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక మినీ ఎకనామిక్ సిటీగా రూపాంతరం చెందనుందని కేంద్ర మంత్రి అన్నారు. ఈ ఎయిర్‌పోర్టు ఈ ప్రాంత అభివృద్ధికి ఒక చోదకశక్తిగా పనిచేస్తుందని, వలసలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో భారీ పారిశ్రామిక అభివృద్ధి జరగనుందని, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'విశాఖ ఎకనామిక్ రీజియన్' కూడా త్వరలోనే వాస్తవరూపం దాల్చనుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న తమన్నా

సినీ నటి తమన్నా బుధవారం తెల్లవారుజామున తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆమె, స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.దర్శనానంతరం ఆలయం వెలుపల తమన్నా మీడియాతో మాట్లాడుతూ తన అనుభూతిని పంచుకున్నారు. "చాలా రోజుల తర్వాత స్వామివారిని దర్శించుకున్నాను. దర్శనం చాలా బాగా జరిగింది. ఇక్కడికి వస్తే ఎంతో ఆనందంగా, ప్రశాంతంగా ఉంటుంది. చిన్నప్పటి నుంచి తిరుమలకు వస్తున్నా, కానీ ఈరోజు జరిగిన దర్శనం లాంటి అనుభూతి ఎప్పుడూ కలగలేదు. చాలా తృప్తిగా, అదృష్టంగా భావిస్తున్నాను. అందరి కోసం ప్రార్థించాను" అని ఆమె పేర్కొన్నారు.దర్శనం అనంతరం, రంగనాయకుల మండపంలో వేద పండితులు తమన్నాకు వేదాశీర్వచనం అందించి, శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా తమన్నాకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వృత్తిపరంగా సినిమాలతో బిజీగా ఉండే తమన్నా, కాస్త విరామం దొరికినప్పుడు ఇలా ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శిస్తుంటారు. తెలుగులో ఆమె చివరిసారిగా 'ఓదెల 2' చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం హిందీ, తమిళ ప్రాజెక్టులపై ఆమె ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన.. పోలీసులు కిందపడేశారన్న ప్రియాంకగాంధీ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు బుధవారం ఢిల్లీలో చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వద్ద ధర్నాకు వెళుతున్న నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.'ఓట్ల చోరీ' జరిగిందని ఆరోపిస్తూ, సీఈసీని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఎంపీలు ఈ నిరసనకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన సౌహార్ద విందు అనంతరం ఎంపీలందరూ బస్సుల్లో జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే, మార్గమధ్యంలో అశోకా రోడ్డు వద్ద పోలీసులు భారీ భద్రతా వలయంతో బస్సులను నిలువరించారు.దీంతో ఎంపీలు రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ప్రియాంక గాంధీ, మరికొందరు మహిళా ఎంపీలు రోడ్డుపై పడుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. పోలీసులు వారిని బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. తనను అదుపులోకి తీసుకునే క్రమంలో మహిళా పోలీసులు కిందకు తోసేసి, గాయపరిచారని ప్రియాంక గాంధీ ఆరోపించారు. రాహుల్ గాంధీని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంలో తరలించారు. కొందరు ఎంపీలు బస్సుల పైకెక్కి జాతీయ జెండాలు ఊపుతూ నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్, టీఎంసీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, ఐయూఎంఎల్ పార్టీల ఎంపీలు పాల్గొనగా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు గైర్హాజరు కావడం గమనార్హం.

## యాసంగిలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు

ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నందున, రానున్న యాసంగిలో రైతులు వరికి బదులు తక్కువ నీటితో పండే పంటల వైపు మళ్లేలా చూడాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రబీ 2026-27 కార్యాచరణ ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి లభ్యత తక్కువగా ఉండే పరిస్థితుల్లో వరి సాగు రైతులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలతో పాటు మంచి ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతూ తన ప్రాంతంలోని భూగర్భ జలాల లభ్యతను చూసుకున్న తరువాతే పంటను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్త ఈ యాసంగిలో ఎల్‌నినో వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాత స్థితి, ఉష్ణోగ్రతల అంచనాలను అధికారులకు వివరించారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ (క్రిడా) శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన చర్యలను వివరిస్తూ, భూగర్భ జలాల లభ్యత ఆధారంగానే పంటల ఎంపిక, సాగు జరగాలని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలను దృష్టిలో ఉంచుకుని వరికి బదులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. పప్పుధాన్య, నూనెగింజల, కూరగాయల పంటలకు అనువైన విత్తన కాలాలను కూడా వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ఈ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి అనువైన పంట రకాలను సిఫార్సు చేశారు. యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో, సరిపడా అందుబాటులో ఉండేలా సరఫరా పరిస్థితిని కూడా కమిషనర్ సమీక్షించారు. రాష్ట్రంలో 2025-26లో 26 జిల్లాల్లో నత్రజని,భాస్వరం ఎరువుల వినియోగ నిష్పత్తులు జాతీయ సగటు (9.7 : 3.7 : 1) కంటే అధికంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు మాత్రమే ఎరువులను వినియోగించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్. జిల్లా అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్., ఉద్యానవన శాఖ సంచాలకులు డాక్టర్ యాస్మీన్ బాషా, ఐ.ఏ.ఎస్. పాల్గొన్నారు. వీరితో పాటు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు; ఇక్రిశాట్, క్రిడా, ఐఎండీ, ఐఐఆర్ఆర్, ఐఐఎంఆర్, ఐఐఓఆర్ సంస్థల శాస్త్రవేత్తలు; ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్రవేత్తలు జిల్లా వ్యవసాయ అధికారులు జిల్లా ఉద్యానవన అధికారులు మార్కెటింగ్ మరియు సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు.తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు.

## పోరాటం ఆగదన్న రేవంత్ రెడ్డి..

ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర విపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యలను అప్రజాస్వామికమని ఆయన మండిపడ్డారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.బుధవారం ఢిల్లీలో నిర్వహించిన నిరసన ప్రదర్శనలో రాహుల్ గాంధీని నిర్బంధించిన అనంతరం, ఆయనను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, వారిని పోలీసులు లోపలికి వెళ్లకుండా అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.ఎన్నికల కమిషన్ (ఈసీ) ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీ, మైనారిటీ వర్గాల ఓటు హక్కును లక్ష్యంగా చేసుకుని వివక్షా పూరితంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "గతంలో ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో లబ్ధి పొందిన వారు, ఇప్పుడు ఏకంగా ఎన్నికల కమిషన్‌నే పావుగా వాడుకుంటున్నారు" అని ఆయన ధ్వజమెత్తారు. అక్రమ అరెస్టులు, పోలీసుల నిర్బంధాలకు విపక్షాలు భయపడవని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

## నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా:

నిన్న ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు.కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## 25 ఏళ్లలో భారత్ దిశ మార్చారు..

ఈ వ్యాఖ్యలు చేశారు.మోదీ రాజకీయాలతో మాత్రమే ఇంతకాలం నాయకత్వాన్ని కొనసాగించలేదని చంద్రబాబు అన్నారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించారని పేర్కొన్నారు. వ్యక్తిగత నిజాయతీ, క్రమశిక్షణ, పనితీరు ఆ విశ్వాసానికి కారణమని తెలిపారు.

**మారుతున్న ప్రపంచంలో స్థిరమైన భారత్**ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు, కరోనా మహమ్మారి, యుద్ధాలు, భౌగోళిక మార్పులు, సాంకేతిక విప్లవం, ఆర్థిక అనిశ్చితి మధ్య భారత్ స్థిరంగా ముందుకు సాగిందని చంద్రబాబు పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో మౌలిక వసతులు వేగంగా విస్తరించాయని, సంక్షేమ పథకాల అమలు బలోపేతమైందని తెలిపారు.2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ ఇప్పుడు 1.46 లక్షల కిలోమీటర్లు దాటిందన్నారు. విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 160కు పైగా పెరిగిందని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం దాదాపు 296 గిగావాట్లకు చేరిందని వివరించారు.

**టెక్నాలజీపై ప్రత్యేక దృష్టి** మమోదీకి సాంకేతికతపై మంచి అవగాహన ఉందని చంద్రబాబు ప్రశంసించారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా బ్యాంకింగ్, సంక్షేమం, ప్రభుత్వ సేవలు ప్రజలకు వేగంగా చేరుతున్నాయని చెప్పారు. క్వాంటమ్ మిషన్, సెమీకండక్టర్ మిషన్, పీఎల్ఐ పథకాలు భారత్‌ను సాంకేతికంగా మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో భాగమన్నారు.అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థలకు అవకాశం ఇవ్వడం వల్ల కొత్త తరం పారిశ్రామికవేత్తలకు అవకాశాలు పెరిగాయని తెలిపారు. కేంద్రం నుంచి మాత్రమే దేశాభివృద్ధి సాధ్యం కాదని మోదీ నమ్ముతారని, రాష్ట్రాలు, నగరాలకు పెద్ద పాత్ర కల్పించారని చంద్రబాబు పేర్కొన్నారు.

**'వికసిత్ భారత్' దిశగా**ప్రపంచ వేదికపై భారత్ ప్రభావం పెరిగిందని చంద్రబాబు అన్నారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే ఇతర దేశాలతో భాగస్వామ్యాలను బలోపేతం చేస్తోందని తెలిపారు. భారత్‌కు యువ జనాభా, వ్యాపార స్ఫూర్తి, సాంకేతిక సామర్థ్యం బలాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో గత 25 ఏళ్లలో ఏర్పడిన దిశ, సంస్థాగత బలం 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ఉపయోగపడుతుందని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

## సుప్రీం తలుపు తట్టిన వైసీపీ.. కౌంటర్ ఇచ్చిన ఏపీ ప్రభుత్వం!

కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

**వైసీపీ పిటిషన్‌పై ప్రభుత్వం కేవియట్..** మరోవైపు వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ వేసింది. ఈ వ్యవహారంపై కోర్టు విచారణ చేపట్టినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని కోరింది. తమ వాదనలను కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ అంశంపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించింది.

## పాతికేళ్ల ప్రజా ప్రస్థానం.. ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది.అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది. ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత, రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్

**తిరుపతి బ్యూరో చీఫ్ అక్టోబర్ 7 నంది పత్రిక** తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయ కృష్ణ బుధవారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. కృష్ణాపురం ఠానా, చింతకాయల వీధి, రామచంద్ర పుష్కరిణి, నిమ్మకాయల వీధి, గాంధీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మురుగు కాలువల పరిస్థితి, చెత్త సేకరణ, రోడ్ల పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. చెత్తను రోడ్లపై వేయకుండా చూడాలని, నిత్యం పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, శానిటేషన్ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది ఉన్నారు.





# బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న జనసేన నాయకుడి మధుసూదన్ ను పరామర్శించిన జనసేన నాయకులు సంధ్య విక్రమ్ కుమార్

**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు మండలం దిన్నదేవరపాడు గ్రామానికి చెందిన జనసేన నాయకులు మధుసూదన్ అన్నకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కోడుమూరు నియోజకవర్గ జనసేన నాయకులు సంధ్యా విక్రమ్ కుమార్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులను కోరారు. కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



# స్వచ్ఛ ఆంధ్ర అవార్డు గ్రహీతను సన్మానించిన జన సేన పార్టీ నాయకులు..



**బేతంచెర్ల అక్టోబర్ 7 ( నంది పత్రిక ).** బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ పరిధిలో గల, ప్రముఖ వైష్ణవ క్షేత్రమగు, శ్రీ మద్దులేటి లక్ష్మీ నర సింహ స్వామి క్షేత్రానికి అరుదైన గుర్తింపుగా స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు గ్రహిత ఉప కమిషనర్ & శ్రీ మద్దులేటీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజ నేయులును, బేతంచెర్ల జనసేన పార్టి ఆధ్వర్యంలో బుధవారం నాడుశ్రీ మద్దులేటీ లక్ష్మి నరసింహ స్వామి క్షేత్రంలో ఈఓ.రామాంజనేయులును మర్యాద పూర్వకంగా కలిసి,శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జన సేన పార్టి నాయకులు శ్రీ కంటి మధు,చల్లా మద్దిలేటి,ఆవు రాజశేఖర్.మనోజ్ పోల మధు. వెంకటేష్,రంగాపురం మధు తది తరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను వ్యవసాయ కార్మికులకు పంచాలి

## ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

**కర్నూల్ సిటీ నందిపత్రిక** రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను వ్యవసాయకార్మికులకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి శేషుకుమార్ లు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన గూడూరు పట్టణంలోని పడమటి బిసి కాలనీలో వీరేంద్ర అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికసంఘం నాయకులు కృష్ణ, శేషుకుమార్, సిపిఐ మండల కార్యదర్శి బీడీల శ్రీనివాసులు, సిపిఐ నాయకులు శివశంకర్ లు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు దాటినా నేటికీ రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులు దారిద్ర రేఖకు దిగువగానే జీవిస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది ఎకరాలను కార్పొరేట్ సంస్థలకు ఎకరా కేవలం 99 పైసలకే 99 సంవత్సరాలపాటు లీజుకు ఇవ్వడం జరుగుతోందని,వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వ భూములను పంచితే వ్యవసాయ కార్మికుల జీవన ప్రమాణాలు పెరిగి దేశం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. వలసలను నివారించాలని 2004 లోని కాంగ్రెస్ ప్రభుత్వంలో 62 మంది వామపక్ష ఎంపీల ప్రభుత్వ భాగస్వామ్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా చతురస్రా మీనన్ ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గొప్పగా ప్రవేశ పెడితే నేటి కేంద్ర ప్రభుత్వం పేరు మార్చి విబి జిరాంజి పేరుతో నీరు గారుస్తోందని విమర్శించారు. గూడూరు పట్టణంలోని వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు కల్పించాలని అన్నారు. రాష్ట్రంలో యల్నినో ప్రభావం వల్ల కరువు విలయతాండవం సందర్భంలో వ్యవసాయ కార్మికులకు కరువు పెన్షన్ అందజేయ్యాలని,అదేవిధంగా పడమటి బిసి కాలనీ వాసులకు అక్కడ గల డంప్ యాడ్ నుండి వచ్చే దుర్గంద భరితమైన దర్వా సన వల్ల అనేక విషపురితమైన రోగాలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని డంప్ యాడ్ ను వెంటనే ఇక్కడి నుండి తరలించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం




ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం(బి కె ఎం యు )పట్టణ కమిటి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా టి, ఈశ్వరయ్య,ఉపాధ్యక్షులు గా లక్ష్మన్న, దుబ్బన్న కార్యదర్శి గా ఇ రాముడు, సహాయ కార్యదర్శులుగా బజారి, చంటి కోశాధికారి గా వేరేంద్ర లతో పాటుగా ఆనంద్, అజేయుడు, ఆంజనేయులు, ప్రవీణ్, మధు,రాజు, శ్రీను, స్వామి, మద్దిలేటి, వెంకటేశ్వర్లు లను కమిటి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుడిపాడు శాఖ కార్యదర్శి సురేష్, గూడూరు నాయకులు లక్ష్మన్న, బాలు, కౌలన్న తదితరులు పాల్గొన్నారు.

# కొలుముల పల్లెలో లో వర్మి కంపోస్టు తయారీపై అవగాహన కార్యక్రమం.




**బేతంచెర్లఅక్టోబర్07(నందిపత్రిక).** బేతంచెర్ల మండలం కొలుములపల్లె గ్రామ పంచాయతీ నందు, జిల్లా పంచాయతీ అధికారి మరియు డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారి పర్యటించి,"చెత్త నుండి సంపద" కార్యక్రమంలో భాగంగా వర్మి కంపోస్టు తయారీ విధానంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో సేకరించే తడి చెత్తను సక్రమంగా వినియోగించుకొని, వర్మి కంపోస్టు తయారు చేసే విధానం, దాని ఉపయోగాలు మరియు గ్రామ పంచాయతీలకు ఆదాయం సమ కూర్చే అవకాశాలపై పంచాయతీ అభివృద్ధి అధికారులు, షేడ్ మిత్రలు మరియు క్లాత్ మిత్రలకు జిల్లా పంచాయతీ అధికారి వివరించారు.అదేవిధంగా ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లను సమర్థవంతంగా వినియోగించుకొని తడి మరియు పొడి చెత్తను వేరు చేయడం, సేంద్రియ వ్యర్థాలను వర్మి కంపోస్టుగా మార్చడం ద్వారా, చెత్తను సంపదగా మార్చే విధానాన్ని ప్రతి గ్రామపంచాయతీలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో మండల ప్రజా అభివృద్ధి అధికారి ( ఎంపీడీఓ) ఎం.ఫజుల్ రెహమాన్, డిప్యూటీ ఎంపీడీఓ బి. మల్లికార్జున , మండలంలోని పంచాయతీ అభివృద్ధి అధికారులు (పీడీఓలు), షేడ్ మిత్రలు, క్లాప్ మిత్రలు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడంతో పాటు,వ్యర్థాల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి గ్రామ పంచాయతీలను మరింత స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.



# మూడో రోజు కొనసాగిన సిపిఐ దీక్షలు





**కర్నూల్ సిటీ నంది పత్రిక** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో కర్నూల్ నగరంలోని పేదల గత ఐదు ఆరు సంవత్సరాల నుండి ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని నిజమైన అర్హులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెండు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని మూడవ రోజు సిపిఐ దీక్షలు కొనసాగాయి ఈ దీక్ష కార్యక్రమానికి సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఎం బీసన్న అధ్యక్షత వహించగాఈ దీక్షల కు మద్దతు తెలియజేయ డానికి వచ్చేసిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి మీరు చేస్తున్నటువంటి ఈ దీక్ష చాలా న్యాయమైనది మీ సమస్య పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం మరియు అధికారులు విచారణ చేయించి అర్హులైన వారందరికీ ఇంటి పట్టా ఇవ్వాలని ఎన్నికల ముందర ప్రజలు అడగకపో యినాప్పటికీ ఆనాటి ప్రతిపక్ష నాయకుడు నేడు మన రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు పట్టణ ప్రాంతంలో పేదలకు రెండు సెంట్లు స్థలం ఇస్తామని గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం ఇస్తామని పేదలందరికీ ఆశలు కల్పించి ఓట్లు వేయించుకున్న ముఖ్యమంత్రి అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరం కావస్తున్న రాష్ట్రంలో ఏ ఒక్క పేదోడికి ఒక్క సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవని ఇచ్చిన హామీని నెరవేర్చి నిజమైన లబ్ధిదారులకు రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని వైయస్సార్సీపి నాయకుడుగా నేను డిమాండ్ చేస్తున్న మీరు చేస్తున్నటువంటి ఈ న్యాయమైన సమస్య పరిష్కారం అయ్యి దీక్షలు విజయవంతం కావాలని కోరుకుంటున్నాను ఈ దీక్ష కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శులు సి మహేష్ డి శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి జిల్లా అధ్యక్షురాలు యస్ . గిడ్డమ్మ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు కుమార్ వెంకటేష్ భద్రకు మార్ అన్వర్ కిట్టు శివ మరియు మహిళలు ఈ దీక్షలో పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరులో పోషణ మాసోత్సవం



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 7:** బండి ఆత్మకూరు లోని అంగన్వాడి కేంద్రం 6 లో బుధవారం పోషణ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు గర్భవతులు బాలింతలతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఆహార వైవిధ్యం ,తగిన ప్రోటీన్ ,అంగన్వాడి కేంద్రంలో తాజా వేడి భోజనం ,సమాజ భాగస్వామ్యం, బాధ్యత, పోషణ, బాల్య ప్రేరణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన తదితర అంశాలపై మహిళలకు వివరించారు. గర్భవతులు, బాలింతలు కూరగాయలు, ఆకుకూరలు గుడ్లు, పాలతోపాటు సీజన్లో లభించే పనులను తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సునీత, ఆనందమ్మ ,నాగరాజమ్మ ఏఎన్ఎం పుష్పలత ,ఆశ వర్కర్లు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగాలు కల్పించాలి : సీఐటీయూ

**డోన్ : నంది పత్రిక, అక్టోబర్ 7** డోన్ మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతి చెందిన పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి. మాణిక్యంశెట్టి, టి. శివరాం డిమాండ్ చేశారు. మృతి చెందిన, రిటైర్ అయిన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు బుధవారం డోన్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నరేష్‌రెడ్డికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ పోరాటాల ఫలితంగా గతంలో పలువురు మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. అయితే ప్రభుత్వం మారిన అనంతరం ఆప్కాస్ సైట్ నిలిపివేయడంతో మరో కార్మికుడి కుటుంబానికి ఉద్యోగం లభించలేదన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ధర్నా నేపథ్యంలో ఆప్కాస్ సైట్‌ను పునరుద్ధరించారని, దీంతో పెండింగ్‌లో ఉన్న కార్మికుడి కుటుంబానికి వెంటనే ఉద్యోగం కల్పించాలని కోరారు. అదేవిధంగా గతంలో రిటైర్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించినప్పటికీ, అధికారుల తప్పిదాల కారణంగా ఆప్కాస్‌లో పేర్లు నమోదు కాలేదనే కారణంతో ఏడాది పాటు పనిచేసిన వారిని తొలగించారని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఇద్దరు కార్మికుల కుటుంబ సభ్యులకు కూడా ఉద్యోగాలు కల్పించాలని కోరారు. 3040 ఏళ్ల పాటు సేవలందించి ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు పొందకుండానే రిటైర్ అయిన కార్మికుల కుటుంబాలకు రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**పందుల బెడదకు తక్షణమే పరిష్కారం**డోన్ పట్టణంలో పందుల బెడద తీవ్రంగా ఉందని సీఐటీయూ నాయకులు తెలిపారు. ఇటీవల వైరస్ కారణంగా రోజూ 10 నుంచి 15 పందులు మృతి చెందుతున్నాయని, వాటిని సకాలంలో తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మృతిచెందిన పందులను తొలగించే సమయంలో మున్సిపల్ కార్మికులు కూడా వాంతులు, వికారం వంటి అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు.

పందుల పెంపకందారులతో మాట్లాడి వాటిని పట్టణ శివారు ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. సీఐటీయూ నాయకుల వినతిపై కమిషనర్ నరేష్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మృతిచెందిన పందులను తొలగించే కార్మికులకు మాస్కులు, గ్లౌజులు, ఇతర రక్షణ పరికరాలు వెంటనే అందజేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పందుల పెంపకందారులతో మాట్లాడి వాటిని పట్టణ శివార్లకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద ఎల్లయ్య, కుల్లాయప్ప, నాయకులు హైమారావుతో పాటు కార్మికుల కుటుంబ సభ్యులు మధు మనోహర్, సురేష్, సునీల్, వెంకటేశ్వర్లు, హరిశివ, మాధవయ్య, చిరంజీవి, శ్రీనివాసులు, ప్రసన్న, మంగమ్మ, సువర్ణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# బిక్షాటన చేస్తూ వీఆర్ఏల నిరసన

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 7:** గ్రామాలలోని వీధులలో బిక్షాటన చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామ రెవెన్యూ సహాయకులు తమ సమస్యల సాధన కోసం చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం తమ సమస్యల పట్ల మొండి వైఖరి అవలంబిస్తుందని వీఆర్ఏలు విచారం వ్యక్తం చేశారు. మండలంలోని 57 మంది గ్రామ రెవెన్యూ నాయకులు తాసిల్దార్ కార్యాలయం ఎదుట కూర్చుని బిచ్చం ఎత్తుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేంత వరకు తాము చేస్తున్న సమ్మెను విరమించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు మండల అధ్యక్షులతోపాటు గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.



# మిగిలిన 12 మండలాలను కరువు మండలాల ప్రకటించండి

## కర్నూలు జిల్లాగా కరువు జిల్లాగా ప్రకటించండి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏ ఐ కె యస్ , వ్యవసాయ అధికారికి వినతి పత్రం.



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగనాథం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు కే నాగేంద్రయ్య మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో కరువు కాటేస్తున్న కూడా ప్రభుత్వం కరువు జాబితాలో మాత్రం 12 మండలాలకు చోటు లేదు జిల్లాలోని అన్ని మండలాల్లో లోటు వర్షపాతంతో అల్లాడుతుండగా 15 మండలాలనే కరువు మండలాలుగా ప్రభుత్వం పరిమితం చేయడంపై రైతాంగం ఆగ్రహం గా ఉన్నారనిపంటలు ఎండిపోతూ పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్న తరుణంలో కరువు హోదా దక్కని మండలాల రైతులకు ప్రభుత్వం సహాయం అందేలా చూడవలసిన స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు అశ్రద్ధ వల్ల కరువు ఉన్న కూడా కరువు మండలాల జాబితాలో లేకపోవడం చాలా బాధాకరమని అలాగేఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో వ్యవసాయం లేని కర్నూల్ అర్బన్ కరువు మండలంగా ప్రకటించడమే అధికారులు ఎంత శాస్త్రీయంగా బాధ్యత రహితంగా ఉన్నారో అర్థమవుతుంది. అర్బన్ మంత్రి ఇలాకా అని ఇచ్చారా లేక మంత్రి కి నష్టపరిహారం ఎవరికి ఇస్తారు ఇంత గుడ్డిగా అధికారులు ఉన్నారు

ని ప్రజలు ముక్కున వేలు వేసుకునే పరిస్థితి ఏర్పడింది అన్ని మండలాల్లోని కరువు ను పరిశీలించి కరువు జాబితాలో ఉంచాలిఅని గ్రామాలను యూనిట్ గా తీసుకొని కరువు నిర్ధారించాలి కనుక ప్రభుత్వం మళ్లీ పునరాలోచించి క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని లేకపోతే ఆ మండల రైతులందరినీ తోడుకొని కలెక్టర్ ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి శ్రీనివాసరావు,బి బి రాముడు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నిక ల్లో కూటమిదే విజయం,

## జగన్ కు బెంగళూరు రే గతి.. సోమిశెట్టి వెంకటేశ్వర్లు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాష్ట్రంలో తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పదం వైపు దూసుకు వెళు తుందని అందువల్ల రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి పార్టీలకు ప్రజలు మద్దతు తెలియజేసి విజయాన్ని కట్టబెడతారని వైసీపీ నేత జగన్ మోహన్ రెడ్డికి ఇక బెంగళూరే గతని కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు వెల్లడించారు.బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి పత్రికల వారితో మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో విజయాన్ని సాదిస్తామని ప్రగల్ పాలు పలుకుతున్నారనీ, నిజానికి రాష్ట్రంలో ప్రజలు 2024 లోనే బుద్ధి చెప్పారని అయినా జగన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు అని ఒకపక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వము ఏర్పడిన తర్వాత కేంద్రంలోని మోడీ సహకారంతో రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులను రాబట్టి పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతోపాటు రాజధాని అమరావతి, భోగాపురం ఎయిర్పోర్ట్ వంటి వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావడానికి ముఖ్యమంత్రి తో పాటు మంత్రివర్యులు నారా లోకేష్ పవన్ కళ్యాణ్ కృషి చేస్తూ ఉంటే. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు పరుస్తుటే వీటన్నింటికీ ప్రజలనుంచి అపూర్వమైన ఆదరణ లభిస్తుంటే జీర్ణించుకోలేని వైయస్ జగన్ రెడ్డి అసత్య ప్రచారానికి తెరతీశారని వారి నోరు మూయించేందుకు చంద్రబాబు నాయుడు అభివృద్ధి ఆయుధంగా మలుచుకుని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయుచున్నారు ఇటీవల కడప జిల్లా ప్రొద్దుటూరు-- కొత్తపల్లిలో జల జీవన్ . మిషన్ అమరజీవి జలధార క్రింద ఇంటింటికి త్రాగునీరు అందించేందుకు 30 వేల కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ విధంగా ఎన్నో ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం కూటమిపై అబాండాలు వేస్తూ ఎన్నికలు సక్రమంగా జరగవంటూ తెలివి తక్కువగా మాట్లాడుతున్నాడు చంద్రబాబు నాయుడు ఏ రోజు కూడా జగన్ లాగా ఆ ప్రజాస్వామికమైన విధానాలను అమలుపరచలేదు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తారు విజయం సాదిస్తారు. అయితే జగన్ గతంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఏ విధంగా అబ్బుస్పాలు చేశారో ఈ రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదు తెలుగుదేశం పార్టీ వారు గానీ ఇతర పార్టీల వారు కానీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వస్తే వారిపై దాడులు చేయించడం కేసులు పెట్టించడం స్టేషన్లో వేయించడం నామినేషన్ పత్రాలను చించి వేయడం ఇది జగన్ ఘనకీర్తి కాదా, ఇక ఓటమి భయం పట్టుకున్న జగన్ కూటమి పార్టీలపై తప్పుడు ప్రచారం చేయడం మానుకొని ఇక బెంగళూరు ప్యాలెస్ కి వెళ్ళిపోతే మంచిదని నీకు బెంగళూరు ప్యాలెస్ గతని తాడేపల్లి, హైదరాబాదు ప్యాలెస్లు ఖాళీ చేయాలని సూచించారు. జగన్ కూటమిపై ఇలాగే అసత్య అభండాలు వేస్తే రానున్న రోజులలో పులివెందుల కూడా మిగలదని హెచ్చరించారు.

# ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి





## అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు మున్సిపల్ యంత్రాంగంతో ఎన్నికల సన్నాహక సమావేశం పోలింగ్ కేంద్రాల వారీగా సామాగ్రి సిద్ధం చేసుకోవాలి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల నిర్వహణకు అందరూ సిద్ధంగా ఉండాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి విధులు కేటాయించామని, సంబంధిత అధికారులు ఎలాంటి పొరపాట్లు చేయకుండా పూర్తి అవగాహనతో, సమర్థతతో పనిచేయాలని సూచించారు. నోటిఫికేషన్ వచ్చేలోపు రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. హెల్ప్ డెస్క్, సీసీ కెమెరాల ఏర్పాటు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ఎన్‌ఓసీ పత్రాల జారీ వంటి ప్రక్రియలను చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఎన్నికల సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని, పింక్ కలర్ బ్యాలెట్ పేపర్ మేయర్ అభ్యర్థికి, వైట్ కలర్ బ్యాలెట్ పేపర్ కార్పొరేటర్ అభ్యర్థికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. షామియానాలు, బారికేడ్లు, భోజన ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత ఏజెన్సీలతో మాట్లాడాలని సూచించారు. సున్నితమైన అంశాలను సమర్థవంతంగా అధిగమించాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం పనికిరాదని కమిషనర్ హెచ్చరించారు.సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ జునైద్, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, ఇన్‌చార్జ్ డీసీపీ శబ్నం శాస్త్రీ, అకౌంట్స్ ఆఫీసర్ రఘునందన్, ఏసీపీ నాగరాజు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా, ఆర్వోలు వాజిద్, క్రిస్టోఫర్, మంజూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ లిటిగేషన్ పాలసీపై మంత్రి వర్గ ఉపసంఘం భేటి

## త్వరలో పాలసీ ముసాయిదా రూపకల్పన - న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, అక్టోబరు 07. నంది పత్రిక :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ ) విధివిధానాల ఖరారు కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం బుధవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యక్షంగా, హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సతీష్ కుమార్ యాదవ్ లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. మంత్రివర్గ ఉప సంఘం న్యాయ శాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. లిటిగేషన్ పాలసీపై గతంలో నిర్వహించిన మంత్రివర్గ ఉప సంఘం సమావేశా లలో సమీక్షించి, చేసిన సూచనల మేరకు న్యాయ శాఖకు చెందిన అధికారులు ఇతర రాష్ట్రాల్లో అమలుకు సంబంధించిన విధానాలను ఉప సంఘం దృష్టికి తీసుకువెళ్లారు.పబ్లిక్ లిటిగేషన్ పాలసీ అమల్లో ఉన్న ఇతర రాష్ట్రాలలో పర్యటించి అక్కడ అమలవుతున్న పబ్లిక్ లిటిగేషన్ పాలసీ కి సంబంధించిన పూర్తి వివరాలను మంత్రులకు న్యాయశాఖ సెక్రటరీ ప్రతిభా దేవి వివరించారు.ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ న్యాయ శాఖలో అనవసర వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం, ప్రత్యమ్నాయ వివాద పరిష్కార ఫోరంలు ఏర్పా టు చేయడం, పారద ర్శకత, జవాబుదారీ తనంకు అనుగుణంగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం"ను త్వరలోనే రూపొందిస్తామని వెల్లడించారు. న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ కోర్ట్ కేసుల పరిష్కారం పై ప్రత్యేకంగా దృష్టి సారించడమే కాకుండా, అమలు కోసం ప్రత్యేకంగా పర్యవేక్షణ కమిటీలు, నోడల్ అధికారులు,ఆన్ లైన్ పోర్టల్ ఏర్పాటుకు సంబంధించి దృష్టి సారించాలని న్యాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతం - ప్రజా సమస్యలు - పార్టీ కార్యకమాలను సమర్థ వంతంగా ముందుకు తీసుకు వెళ్లాలి.

### డోన్ మాజీ ఎంఎల్ఎ కోట్ల సుజాతమ్మ సూచన.




**బేతంచెర్ల అక్టోబర్ 7 ( నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల నాయకులు మరియు కార్యకర్తలతో డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ బుధవారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు, పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులు,ఆమె కార్యకర్తలతో చర్చించారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ గోవర్ధన్ రెడ్డి పాల్గొని నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బుగ్గన ప్రసన్న లక్ష్మి మయూరి సుబ్బారెడ్డి ఆపతి ప్రతాప్, నాగరాజు,సయ్యద్ ఫయ్యాజ్,స్థానిక నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెట్నహళ్లి గ్రామం మండల పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ ను సస్పెండ్ చేయాలి: ఏఐఎస్ఎఫ్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** మంత్రాలయం మండలం చట్నీహళ్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.సుధాకర్ ని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి ఎస్.ఈరేష్ బి.రంగస్వామి మాట్లాడుతూ కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చట్నీహళ్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మరియు ఆయన కింద పనిచేసేటువంటి ఏ ఉపాధ్యాయుడు తాను చెప్పిన మాట వినకుంటే మానసికంగా వేధించి తన దారిలోకి తెచ్చుకునేందుకు ఇంతకైనా దిగజారి ఆయన కింద పని చేసే ఉపాధ్యాయుల జీవితాన్ని నాశనం చేస్తున్నాడని అందులో భాగంగానే ఈరోజు పాఠశాలలో విద్యార్థులను మౌనిక అనే ఉపాధ్యాయురాలు విద్యార్థులను ఏమీ అనకపోయినా కానీ కొట్టిందని బయటకి ప్రచారం చేసి ఆమెకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఇలాంటివి ప్రోత్సహించడం మంచి పద్ధతి కాదని తన కింద పని చేసేటువంటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ ఇలాంటి నీచ కార్యక్రమాలకు పాల్గొనడం చూస్తుంటే అతని దగ్గర పని చేయడానికి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు భయపడుతున్నారని కావున అతనిని తక్షణమే సస్పెండ్ చేసి, అక్కడి నుంచి వేరొక చోటికి బదిలీ చేయాలని ఏఐఎస్ఎఫ్ గా డిమాండ్. లేనిపక్షంలో విద్యార్థులందరి సమీకరించి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు వి.వీరంజినేయులు, ఎస్. మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన ఉద్యానవనాల అభివృద్ధి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

### 19 ఉద్యానవనాల అభివృద్ధికి రూ.1.94 కోట్లు



**కర్నూల్ సిటీ నందిపత్రిక** కర్నూలు నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఉద్యానవనాల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. రూ.1.94 కోట్లతో చేపట్టిన 19 ఉద్యానవనాల అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. బుధవారం వీనస్ కాలనీలోని జెండా పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. నిర్దేశిత గడువులోపు, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా వెంకటరమణ కాలనీలోని జిటియస్ స్టేషన్, బళ్లారి చౌరస్తా వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈ గిరిరాజ్, డిఈ కృష్ణలత, టిపిఈ రాంమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్వల యోజన పథకం సురక్ష యోజన గ్రామ సడక్ యోజన పథకాల గురించి వివరిస్తున్న బిజెపి నాయకులు వేల్పుల గోపాల్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ గూడూరు రూరల్ మండల సమావేశం కె.నాగలాపురం నందు గూడూరు రూరల్ మండల అధ్యక్షులు వెంకటేష్ ఆధ్వర్యంలో మండల ఇంచార్జి జి ఎస్ నాగరాజు యస్ సి మోర్చ రాష్ట్ర నాయకులు వేల్పుల గోపాల్ 75/25 సం రాలు భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదినోత్సవ సందర్భంగా సేవ సంకల్ప అభియాన్ కార్యక్రమములను మండలలోని ప్రతి గ్రామంలో పర్యాటన చేసి భారత ప్రధాని నరేంద్రమోదీ కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల యోజన పతకం వితంతు వృద్ధాప్య ఒంటరి సురక్ష యోజన గ్రామ సడక్ యోజన వంటి పతకాలను ప్రజలకు వివరించుటం చేయాలని రానున్న సర్పంచ్ యం పి టి సి జెడ్ పి టి సి సమ్ సిద్ధం కావాలని అన్నారు ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు భూపాల్ అల్లిసా రజాక ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి గిరి సుధాకర్ రాజశేఖర్ కిసాన్ మోర్చా అధ్యక్షులు వుషెన్ నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు.





**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 7 ( నంది పత్రిక )** సమాజంలో ప్రతి రోజు ఏదో ఒక ఎత్తుగడతో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారని,సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకూడదని విద్యార్థినులకు మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జయరాం పేర్కొన్నారు. నంద్యాల గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ లో అక్కడ డిప్లమా చదువుతున్న అమ్మాయిలకు మహిళా చట్టాలపై మరియు శక్తి ఆకులపై అవేర్నెస్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగినది ఈ ప్రోగ్రామునకు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ జయరాం మరియు పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ , అధ్యాపకులు విద్యా శ్రీ మరియు మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొనడం జరిగినది మహిళా పోలీస్ స్టేషన్ సిఐ మాట్లాడుతూ ప్రతిరోజు ఏదో ఒక కొత్త ఎత్తుగడలతో సైబర్ నెరగాళ్లు రెచ్చిపోవడం జరుగుతున్నది ఏదైనా మీ ఫోన్ లకు ఈ కేవైసీలు వచ్చిన ఫోన్లో బెదిరింపు కాలు వచ్చిన మరియు మీకు సంబంధించిన ఏదైనా మీ షో ఫ్లిప్కార్ట్ అమెజాన్ పార్సెల్ వచ్చిన మీకు తెలియకుండా జాగ్రత్తగా ఉండాలని తీసుకోకపోవడమే మంచిదని అన్నారు.ఈ కేవైసీలు ఓపెన్ చేయకపోవడం మంచిదని ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు సైబర్ ఫోన్ నెంబర్ 1930 ను ఉపయోగించుకొని రక్షణ పొందగలరని కోరారు. ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు లేదా పోకిరిల వల్ల ఏదైనా సమస్య వస్తుందని తెలిసినప్పుడు ఏదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు లేదా నీకు తెలిసిన లేక మీ ఉంటున్న పరిసరాల్లో చిన్న పిల్లలకు పెళ్లిళ్లు చేస్తున్న లేదా ర్యాగింగ్ జరిగిన మత్తు పదార్థాలు అమ్ముతున్నారని తెలిసినప్పుడు 112 పోలీస్ నెంబర్ కు ఫిర్యాదు చెయ్యగలరని కోరారు. దూర ప్రదేశాలకు ఏదైనా పోటీ పరీక్షలు రాయడానికి వెళ్లినప్పుడు అక్కడ ఎవ్వరు బంధువులు లేనప్పుడు వన్ స్టాప్ సెంటర్ లను ఉపయోగించు కోవాలని అక్కడ ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ మహిళలకు ఉచిత వసతి కల్పిస్తున్నది అని అవర్ నెస్ ప్రోగ్రామ్ బాలికలకు తెలపడం జరిగినది.

# పోషణతోనే ఆరోగ్యకరమైన తరానికి బలమైన పునాది...!







## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
## పోషకాహార లోపం లేని జిల్లాగా కడపను తీర్చిదిద్దడమే లక్ష్యం
## 'మన అంగన్‌వాడీమన బాధ్యత'తో పోషణ మాసం విజయవంతం
## అంగన్‌వాడీల బలోపేతానికి సమాజ భాగస్వామ్యం అవసరం

**కడప బ్యూరో చీప్, అక్టోబర్ 7 నంది పత్రిక:** జిల్లాలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది గత కొన్నేళ్లుగా చేస్తున్న సమష్టి కృషి వల్ల ఆరోగ్యం, పోషణకు సంబంధించిన సూచీల్లో గణనీయమైన పురోగతి సాధ్యమైందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వివరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం2026 జిల్లా స్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పోషణ మాసం విజయవంతంగా కొనసాగడానికి చేపట్టిన చర్యలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్న "పోషణ మాసం" కేవలం ప్రభుత్వ శాఖల కార్యక్రమంగా కాకుండా ప్రజలందరి భాగస్వామ్యంతో నిర్వహించాల్సిన సామాజిక ఉద్యమంగా భావించాలన్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సమతుల్యమైన పోషకాహారం అందించడం, రక్తహీనతను తగ్గించడం, తల్లులు, పిల్లల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, బాలల సమగ్ర వికాసానికి అవసరమైన వాతావరణం కల్పించడం వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో చేపట్టిన నిరంతర చర్యలు అభినందనీయం అన్నారు. ఆకాంక్ష జిల్లా, ఆకాంక్ష మండల కార్యక్రమాల్లో ఆరోగ్యం, పోషణ అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఉందని, ఈ అంశాల్లో కడప జిల్లా వరుసగా త్రైమాసికాల్లో దేశంలో అగ్రస్థానంలో నిలవడం వెనుక క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావం, పటిష్టమైన అమలు విధానం ప్రధాన కారణమని తెలిపారు. ఈ విజయానికి కృషి చేస్తున్న జిల్లా యంత్రాంగం, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందిని అభినందించారు. ఆరోగ్యం, పోషణ రెండు వేర్వేరు అంశాలు కాదని, రెండూ పరస్పరం అనుసంధానమై ఉంటాయని కలెక్టర్ వివరించారు. తల్లి ఆరోగ్యం, శిశువు ఆరోగ్యం, చిన్నారుల ఎదుగుదలతో పాటు పెద్దల ఆరోగ్యానికి కూడా సమతుల్యమైన, సంపూర్ణమైన పోషకాహారమే పునాది అని తెలిపారు. శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఏదైనా లోపిస్తే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు వారి అభివృద్ధిపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సమతుల్యమైన పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసిందని, అందించే ఆహార నాణ్యత, పంపిణీ, అమలును నిరంతరం పర్యవేక్షించే విధానాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అయితే పోషకాహారం అందించడంతో పాటు కుటుంబాల్లో ఆహారపు అలవాట్లలో మార్పు తీసుకురావడం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లలకు ఏం తినాలో చెప్పడంతో పాటు ఏం తినకూడదో కూడా స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం శుద్ధి చేసిన ఆహార పదార్థాలు, అధికంగా తయారీ ప్రక్రియకు గురైన చిరుతిళ్లు, శీతల పానీయాలు, బిస్కెట్లు, చాక్లెట్లు తదితరాలకు చిన్నారులు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ఆకర్షణీయమైన రుచి, రూపం, ప్యాకింగ్‌తో మార్కెట్లోకి వస్తున్న ఇలాంటి పదార్థాల్లో సహజమైన పోషక విలువలు తక్కువగా ఉండే అవకాశం ఉందని, అధిక తయారీ ప్రక్రియ కారణంగా పీచు వంటి ముఖ్యమైన పోషకాలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. అందువల్ల పిల్లలకు ఇటువంటి ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించి సహజమైన, స్థానికంగా లభించే పోషకాహారాన్ని అలవాటు చేయాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లను చిన్న వయస్సు నుంచే పిల్లలకు నేర్పించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రెండు నుంచి ఐదేళ్ల వయస్సు వరకు పిల్లలకు ఆటలు, కథలు, మాటలు, బొమ్మలు వంటి సులభమైన పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం, అనారోగ్యకరమైన ఆహారం మధ్య తేడాను వివరించాలని సూచించారు. చిన్న వయస్సులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు చెప్పే విషయాలు పిల్లల మనసుల్లో బలంగా నాటుకుపోతాయని, అందువల్ల ఈ దశలో కల్పించే అవగాహన వారి జీవితాంతం ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.స్థానికంగా తక్కువ ఖర్చుతో లభించే పోషకాహారాన్ని కుటుంబాలు ఎక్కువగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా బొప్పాయి తక్కువ ఖర్చుతో విటమిన్ 'ఎ', 'సి' వంటి ముఖ్యమైన పోషకాలను అందించే మంచి పండు అని, ఇలాంటి స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు తదితరాలను రోజువారీ ఆహారంలో భాగం చేయాలని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ భారతదేశంలో బియ్యం ఆధారిత ఆహారం ఎక్కువగా తీసుకునే అలవాటు ఉందని, ఫలితంగా ఆహారంలో కార్బోహైడ్రేట్ల శాతం అధికంగా ఉండే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. బియ్యం ద్వారా శరీరానికి అవసరమైన శక్తి లభించినప్పటికీ, కేవలం శక్తిని అందించే ఆహారంతో సంపూర్ణ పోషణ సాధ్యం కాదని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు శరీర నిర్మాణం, ఎదుగుదల కోసం ప్రోటీన్ తగిన మోతాదులో అందాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా చిన్నారుల మెదడు అభివృద్ధికి అవసరమైన ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు, ఒమేగా కొవ్వు ఆమ్లాలు కూడా తగిన మోతాదులో లభించేలా ఆహారంలో వైవిధ్యం ఉండాలని సూచించారు. అన్నంతో పాటు కొద్దిపాటి కూర లేదా పప్పుతో భోజనం పూర్తయిందని భావించకుండా ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు తదితర పోషక పదార్థాలను సమతుల్యంగా ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా పిల్లల ఆహారంలో ప్రోటీన్, విటమిన్లు, ఖనిజ లవణాలు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు తగిన మోతాదులో ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల జీవితంలో తొలి రెండేళ్లు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైన దశ అని కలెక్టర్ వివరించారు. పుట్టిన తర్వాత తొలి 1518 నెలల్లో మెదడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఐదేళ్ల వరకు కూడా ఈ అభివృద్ధి కొనసాగుతుందని తెలిపారు. ఈ దశలో అవసరమైన పోషకాలు సరైన మోతాదులో అందకపోతే పిల్లల శారీరక, మానసిక, మేధో వికాసంపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి, ప్రతి చిన్నారికి మెరుగైన పోషకాహారం, ఆరోగ్యం, ప్రాథమిక విద్య, సురక్షిత వాతావరణం అందించడంతో పాటు పోషకాహార లోపం లేని, ఆరోగ్యకరమైన తరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా మాట్లాడుతూ... "మన అంగన్‌వాడీమన బాధ్యత" అనే భావనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి కేవలం మహిళా, శిశు సంక్షేమ శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి శాఖ, ప్రజాప్రతినిధి, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థ, యువజన సంఘాలు భాగస్వామ్యంతో బాలవడులు భవిష్య తరాలకు బాటలు వేయాలన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకుని బొమ్మలు, పుస్తకాలు, అభ్యసన సామగ్రి, ఇతర అవసరమైన సౌకర్యాల కల్పనకు సహకరించేలా ప్రజలను ప్రోత్సహించాలని అన్నారు. అంగన్‌వాడీల అభివృద్ధి, పిల్లల పోషణ, పరిశుభ్రత వంటి అంశాల్లో స్థానిక సమాజం జవాబుదారీతనం తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉన్న స్థలాలను ఉపయోగించుకుని పోషణ తోటలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు స్థలం, కంచె, నీటి సౌకర్యం కల్పించేందుకు సహకరించాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు కూరగాయల విత్తనాలు, కూరగాయల కిట్లు, మునగ, బొప్పాయి తదితర మొక్కలను అందించాలని ఆదేశించారు.స్థానికంగా పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను పిల్లల పోషణకు ఉపయోగించుకునే విధంగా కుటుంబాలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కనీసం ఒక సమన్వయ సమావేశం, ఒక సామూహిక భోజన రుచి పరీక్ష, ఒక పోషక వంటకాల ప్రదర్శన, ఒక పోషణ మేళా, ఒక ప్రధానమంత్రి మాతృ వందన యోజన ప్రత్యేక నమోదు శిబిరం నిర్వహించడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు.డిఎంహెచ్ఓ యుగంధర్ మాట్లాడుతూ... పోషణ మాసం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ప్రతి కుటుంబంలో ఆచరణాత్మక మార్పుకు దారితీసేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. సమష్టి కృషితో జిల్లాను పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆరోగ్యశాఖ ఆరోగ్య పరీక్షలు, టీకాలు, రక్తహీనత పరీక్షలు, పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల గుర్తింపు, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. విద్యాశాఖ పాఠశాల సిద్ధత కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయులు అంగన్‌వాడీ సమన్వయ సమావేశాల్లో పాల్గొనేలా చూడాలని అన్నారు.ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు, టీకాలు, రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన పిల్లలను బాలల అభివృద్ధి కేంద్రాలకు పంపించాలని ఆదేశించారు.డీఈవో శంశుద్దీన్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద అర్హులైన గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకోసం ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని తెలిపారు.గ్రామసభల్లో అంగన్‌వాడీ సేవలపై సమీక్ష నిర్వహించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కూడా బాధ్యత స్వీకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాలు తల్లులు, గర్భిణీలను పోషణ మేళాలు, పోషక వంటకాల ప్రదర్శనలకు భాగస్వాములను చేయాలని, అంగన్‌వాడీల్లో అందించే భోజనాన్ని పర్యవేక్షించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలను మెరుగుపరచాలని, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల సహకారంతో బొమ్మలు, పుస్తకాలు, అభ్యసన సామగ్రి సేకరణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఐసిడిఎస్ పీడి రమాదేవి మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్ ఆలోచనా సామర్థ్యం, నేర్చుకునే సామర్థ్యం, మేధో వికాసం, శారీరక ఎదుగుదలకు తొలి దశలో అందే పోషకాహారం బలమైన పునాది వేస్తుందన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు పిల్లల విద్యాభివృద్ధికి ఎంత ముఖ్యమో, అంతకంటే ముందుగా ఇంట్లో తల్లిదండ్రులు అందించే పోషకాహారం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. అందువల్ల తొలి రెండేళ్లలో పిల్లలకు సమతుల్యమైన, సంపూర్ణమైన పోషకాహారం అందించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సీడీపీవోలు, అంగన్వాడీ కార్యకర్తలు, పోషణ్ మాసంలో చేపట్టిన, అంగన్వాడీ కేంద్రాల విశిష్టతను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్ మిలన్ జిల్లా కన్వీనర్ చేపూరి శారదమ్మ, జిల్లా మహిళా, మిషన్ పోషణ్ 2.0 జిల్లా సమన్వయకర్త బి. లవణ్ కుమార్ రెడ్డి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సీడీపీఓలు, పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## పశుగ్రాస సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 07 (నంది పత్రిక):** ఎల్‌నినో ప్రభావం కారణంగా పశు గ్రాస కొరత రాకుండా ముందుజాగ్రత్తగా రైతులు తమ వ్యవసాయ భూముల్లో పశు గ్రాసం సాగు చేసుకునేలా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 'వి బి జి రాంజీ 2026–27' పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని రుద్రవరం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. ఈ పథకం కింద అర్హత, ఉపాధి హామీ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు తమ సొంత భూమిలో 0.25 నుంచి గరిష్ఠంగా 1 ఎకరం వరకు సూపర్ నేపియర్, హైబ్రిడ్ నేపియర్ (సీఓ–3, సీఓ–4) వంటి మేలైన పశుగ్రాస రకాలను సాగు చేసుకోవచ్చని, ఎకరాకు రెండేళ్ల కాలానికి గాను రూ.69,781 (కూలీ ఖర్చు రూ.53,040, సామగ్రి ఖర్చు రూ.16,741) మంజూరు చేయడంతో పాటు 170 పనిదినాలు కల్పిస్తారని వివరించారు. దీనివల్ల సంవత్సరం పొడవునా పశువులకు పచ్చి మేత అందుబాటులో ఉండి ఆరోగ్యం, పాల ఉత్పత్తి మెరుగుపడే అవకాశం ఉన్నందున అర్హులైన రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కడప ఉర్సు ఉత్సవాలకు మంత్రి ఫరూక్ కు ఆహ్వానం



**అమరావతి,అక్టోబరు 07. నంది పత్రిక:**కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను దర్గా ప్రతినిధులు ఆహ్వానించారు.బుధవారం వెలగపూడి సచివాలయం లోని మూడవ బ్లాక్ లో ఉన్న మంత్రి పేషీ కార్యాలయంలో మంత్రికి దర్గా ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 24 నుంచి 29 వరకూ జరిగే ఉత్సవాలకు హాజరు కావాలని కోరారు. ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్ల గురించి మంత్రి ఫరూక్ ఆరా తీశారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలని ప్రతినిధుల బృందానికి మంత్రి ఫరూక్ సూచించారు.

## వన్యప్రాణుల సంరక్షణకు ప్రజల భాగస్వామ్యం అత్యసరం: రేంజ్ ఆఫీసర్ ముర్తుజావ



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 07 (నంది పత్రిక):** అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని రుద్రవరం రేంజ్ ఆఫీసర్ ముర్తుజావలి స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా డీడీపిటీ సి.చైతన్య కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, సబ్ డీఎఫ్ఓ ఎస్.బి.శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో 72వ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆలమూరు సెక్షన్ పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో రచ్చబండ వద్ద విద్యుత్ శాఖ అధికారులతో కలిసి గ్రామస్తులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "ఆవాసాల అనుసంధానం వృద్ధి చెందుతున్న వన్యప్రాణులు" అనే ఇతివృత్తంతో అక్టోబర్ 2 నుంచి 8 వరకు జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా అటవీ సంపద ప్రాముఖ్యత, వన్యప్రాణుల ఆవాసాల పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. రైతులు తమ పంటల రక్షణ కోసం విద్యుత్ తీగలు అమర్చడం, ఉచ్చులు, వలలు వేయడం లాంటి పద్ధతుల వల్ల అడవి జంతువులకు జరిగే నష్టాలను వివరిస్తూ, అక్రమ వేటను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్ రమణయ్య, లైన్ మెన్ సద్దాం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు జి.శ్రీనివాసులు, పి.మాబుఖాన్, టి.రామకృష్ణ, బీట్ ఆఫీసర్లు సురేంద్ర గౌడ్, నగేష్, వల్చర్ బేస్ క్యాంప్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## పేదరిక నిర్మూలనలో పత్తి పంట సాగు విశిష్టమైన పాత్ర పోషిస్తుంది.



**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 7 ( నంది పత్రిక )** పేదరిక నిర్మూలనలో పత్తి పంటసాగు విశిష్టమైన పాత్ర పోషిస్తుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు.

**ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాలలో అక్టోబర్ ఏడవ తేదీన ప్రపంచ పత్తి దినోత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ వి. జయలక్ష్మి మాట్లాడుతూ మన రాష్ట్రంలో ప్రత్తి పంటను సాగుచేసే రైతులు ఎదుర్కొంటున్న టువంటి సమస్యలు,వాటిని అధిగమించుటకు పాటించవలసినటువంటి విధానాలను తెలియపరిచారు. పేదరిక నిర్మూలనలో ప్రత్తి పంట సాగు విశిష్టమైనటువంటి పాత్ర పోషిస్తుందని తెలిపారు. దేశీయంగా స్థిరమైన ఆర్థిక అభివృద్ధికి తన వంతు తోడ్పాటున అందిస్తున్న ప్రత్తి పంట సాగు నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న పరిస్థితులలో శాస్త్రవేత్తలు మరియు రైతులు కీలకపాత్ర పోషించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నంద్యాల నుండి విడుదలై మన ప్రాంతానికి అనువైన రకాలను మరియు వాటి ప్రాధాన్యత గురించి వివరించారు. ప్రత్తి పంట లాభసాటిగా మారాలంటే తెగుళ్లు మరియు చీడపీడల నివారణకు నూతన విధానాలను పాటించాలని మరియు దేశీయంగా అధిక సాంద్రత విధానాలలో ప్రత్తి పంట సాగును ప్రోత్సహించడం మరియు యంత్రాల ద్వారా పత్తి తీయగలిగే వంగడాలను అందుబాటులోకి తీసుకురావడం ముఖ్యమని అన్నారు . ఈ కార్యక్రమములో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు మరియు పాలిటెక్నిక్ వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

# నంద్యాలలో కదం తొక్కిన కమలదళం.. అట్టహాసంగా 'సేవా జ్యోతి' యాత్ర!





**మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవకు నీరాజనం.. మార్మోగిన వికసిత్ భారత్ నినాదం**

**వాజ్‌పేయి విగ్రహానికి నివాళులు అర్పించి భారీ ర్యాలీ**

**బీజేపీలో చేరిన ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల నాయకులు**

**మున్సిపల్ పోరుకు సన్నద్ధం.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు**

**దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు**

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 7 ( నంది పత్రిక )**

నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా నంద్యాల జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ సంకల్ప సభ', 'సేవా జ్యోతి యాత్ర' కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. బీజేపీ దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రతిష్ఠాత్మక 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు నేతృత్వంలో ఈ వేడుకలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి.

**ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షణ.. వాజ్‌పేయి విగ్రహానికి కి నివాళులు:**

తొలుత, జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి నాయకులు వివరించారు. అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని జిల్లా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా వీక్షించారు. తర్వాత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**మార్మోగిన వికసిత్ భారత్ నినాదం:** జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ప్రత్యేక రథంపై సేవా జ్యోతి ప్రజ్వలన చేసి యాత్రను లాంఛనంగా ప్రారంభించారు. భరతమాత ఆలయం నుంచి శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ఆడిటోరియం వరకు సాగిన ఈ యాత్రలో బీజేపీ శ్రేణులు పార్టీ జెండాలు చేతబూని భారీ ర్యాలీగా కదం తొక్కారు. దారిపొడవునా వికసిత్ భారత్ నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అభిరుచి మధు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రజా జీవితం దేశ సేవ, ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలతో సాగుతోందన్నారు.

ఆయన నిస్వార్థ సేవ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రతి కార్యకర్తా ప్రజల మధ్యకు వెళ్లి సేవా కార్యక్రమాలు చేపట్టాలని, 'వికసిత్ భారత్' నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**బీజేపీలోకి వలసలు.. మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్:**

ఈ కార్యక్రమంలో ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాలకు చెందిన పలువురు నాయకులు జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో.. మున్సిపాలిటీల వారీగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై పార్టీ శ్రేణులతో ఆయన సుదీర్ఘంగా చర్చించి కసరత్తు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌ఛార్జి, కో-ఇన్‌ఛార్జి, రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళా, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# సోలార్ విద్యుత్‌పై అవగాహన శిబిరం

**సబ్సిడీ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : డీఈ నాగేంద్ర**




**డోన్ – నంది పత్రిక అక్టోబర్ 7** డోన్ పట్టణంలోని సమైక్యాంధ్ర కట్ట వద్ద విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర శిబిరాన్ని ప్రారంభించి ప్రజలకు సోలార్ విద్యుత్ వినియోగం, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా డీఈ నాగేంద్ర మాట్లాడుతూ ఇంటి అవసరాలకు సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. సోలార్ విద్యుత్ ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని పేర్కొన్నారు. ఈ అవగాహన శిబిరం మూడు రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. సోలార్ విద్యుత్ ఏర్పాటుపై ఆసక్తి ఉన్న ప్రజలు శిబిరాన్ని సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఈ నాగేంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో డోన్ టౌన్ ఏఈ మురళీకృష్ణ, రూరల్ ఏఈ నాగేశ్వర్ రెడ్డి, లైన్మెన్లు రంగస్వామి, హోమేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ మంత్రిని విమర్శించే స్థాయి టిడిపి నాయకులకు లేదు.

**వైఎస్ఆర్సిపి బేతంచెర్ల పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్.**



**బేతంచెర్ల అక్టోబర్ 7 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణం శ్రీనగర్ కాలనీలో గల షాది ఖానా విషయంలో, ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ని విమర్శించే స్థాయి టిడిపి నాయకులకు లేదని, వైఎస్ఆర్సిపి బేతంచెర్ల పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్,ముస్లిం మైనార్టీ జిల్లా నాయకులు ఎస్, ఖాజా హుసేన్,ఎస్. ముర్తుజా వలి అన్నారు. స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ,షాదిఖానా నిర్మాణానికి 2001 సంవత్సరములో భూమి పూజ చేసి, నిర్మించడానికి అన్ని పనులను దగ్గరుండి జరిపించిన ఘనత మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికే దక్కుతుందని వారన్నారు. 2019 సంవత్సరము బుగ్గన ఎమ్మెల్యే అయిన తర్వాత, పీసీసీ చైర్మన్ పదవి చేపట్టిన వెంటనే,అప్పటి టిడిపి ప్రభుత్వం హాయంలోనే, శాదిఖాన అభివృద్ధి కొరకు, 30 లక్షల రూపాయలు విడుదల చేయిస్తే, ప్రభుత్వం మాది కనుక పది హేను లక్షలు మాకు ఇస్తే,మేము కొత్త షాది ఖాన నిర్మించు కుంటామని, టిడిపి నాయకులు 15 లక్షల రూపాయలు తీసుకోని,ఇంతవరకు కూడా,ఆ కొత్త షాది ఖానాను ఎక్కడ నిర్మించారో, ఎక్కడ అభివృద్ధి చేశారో, టిడిపి నాయకులు రుజువు చూపించాలన్నారు. 15 లక్షలతో శ్రీనగర్ కాలనీలోని షాదిఖానాకు, అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తే, ఈనాడు టిడిపి అధికారంలోకి వచ్చింది కదా అని, కాంపౌండ్ వాల్ చుట్టూ నాలుగు లైన్ల ఇటుకలు పేర్చి, మేమే అభివృద్ధి చేశామంటే, ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని వారన్నారు. మా ఇంట్లోని శాదీకి,షాదిఖానాకు 40 వేల రూపాయలు మీరు తీసుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. షాది ఖానాలో షాది జరిగితే అక్కడే సామాన్లు తీసుకొని వినియోగించు కోవాలని, బయట నుండి తెచ్చుకున్న సామాన్లను అనుమతించ బోమని, మీరే బాడుగ సామాన్లను పెట్టి వ్యాపారం చేస్తున్నది మీరు కాదా ? అని ప్రశ్నించారు. బేతంచెర్ల అభివృద్ధి గురించి విమర్శించి మాట్లాడే వారు!నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. ప్రశాంతంగా ఉన్న బేతంచెర్ల ముస్లిం మైనార్టీ ప్రజల మధ్య, బయటి ప్రాంతాల నుండి, జీవనోపాధి కొరకు బేతంచెర్లకు వచ్చి, స్థిరపడి, అన వసరమైన విభేదాలు సృష్టించే విధంగా మాట్లాడడం టిడిపి నాయకులకు మంచిది కాదన్నారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో కూడా శాది ఖాన అభివృద్ధికి నగర పంచాయతీ నుండి నిధులు మంజూరు చేయించుకున్న ఫండ్ తప్ప, టిడిపి ప్రభుత్వం నుంచి ఒక్క నయా పైసా టిడిపి నాయకులు తీసుకు రాలేని, అటువంటి మీరు, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ని విమర్శించే స్థాయి మీకు ఎక్కడిది? అని వారు ప్రశ్నించారు. ఇకనైనా ప్రజల మధ్య విభేదాలు సృష్టించ కుండా, నిజా నిజాలు తెలుసు కొని మాట్లాడితే బాగుంటుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముస్లిం మైనార్టీ మాజీ అధికారి ముర్ధుజావలి, కౌన్సిలర్ ఇబ్రహీం,షేక్షావలి,ముల్లా,వలి భాష, రజాక్ముస్లిమ్ సోదరులు పాల్గొన్నారు.

# ఉద్యోగం కంటే విద్యార్థుల ప్రతిభ ముఖ్యం.





**విద్యార్థుల మనసులో ఏమి సాధిస్తారో వాటికి ప్రాధాన్యత కల్పించాలి.**

**సంక్రియన్ సంస్థకు అభినందనలు.**

**నంద్యాల సిటీ బ్యూరో అక్టోబర్ 7 ( నంది పత్రిక** )సమాజంలో ఉద్యోగం కంటే విద్యార్థుల ప్రతిభ ముఖ్యమని,విద్యార్థుల మనసులో ఏమి సాధిస్తారో తెలుసుకొని వాటికి ప్రాధాన్యత కల్పిస్తే భవిషత్తు బాగుంటుందని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మెన్ డాక్టర్ జి.రామకృష్ణా రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల స్థానిక శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎస్బిఐ కాలనీ లో బుధవారం " మహా ఉద్యోగ సమ్మేళనం " నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి .రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్ డా.జి. హేమంత్ రెడ్డి , క్రౌన్ టాక్సిస్ మేనేజర్ పృథ్వి , ఐకాన్ ఫైల్స్ మేనేజర్ వెంకటేష్ ,గ్లోబల్ టాక్సెస్ హెచ్ ఆర్ కళ్యాణి ,బ్లూవింగ్స్ టాక్స్ మేనేజర్ ఆదిత్య , ఆవ ట్రాక్ సొల్యూషన్స్ మేనేజర్ యశ్వంత్ , మౌళి , ప్రణవి , అరుణ కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్లు కె.. సంపత్ కుమార్ ,ఎం. ఇంతియాజ్ అహమ్మద్ మరియు నంద్యాల పరిసర ప్రాంతాలలో నుండి సుమారు 250 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి .రామకృష్ణారెడ్డి గారు మాట్లాడుతూ సింక్రియన్ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఇటువంటి ఉద్యోగ సమ్మేళనాలు మన కళాశాలలో నిర్వహించినందుకు. ఇదేం మొదటిసారి కాదు ఇటువంటి ఉద్యోగ సమ్మేళనాలను మన కళాశాలలో ఏర్పాటు చేయడం గత ఐదు సంవత్సరాల నుంచి సింక్రియన్ సంస్థ వారు మన కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ సంస్థలో మన కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతో మంది ఉద్యోగం చేయడం చాలా ఆనందదాయకంగా ఉంది అని తెలియజేశారు. ఇప్పుడు జరుగుతున్న ఈ ముఖాముఖిలో ఎక్కువ మంది విద్యార్థులు ఎంపిక కావాలి అని ఆశిస్తున్నాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావాలని ఆశిస్తున్నాను అని తెలియజేశారు. కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ . ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ సింక్రియన్ సంస్థకి కృతజ్ఞతలు తెలియజేశారు. సింక్రియన్ సంస్థ డిసెంబర్ 28 ,2016న ప్రారంభించబడింది. ఈ సింక్రియ సంస్థ గత మూడు సంవత్సరాల నుంచి మన కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కలిగిస్తుంది. ఈ ఉద్యోగం ముఖాముఖి వలన విద్యార్థులు తమ నైపుణ్యాలనే కాకుండా వారు ఏం సాధించగలరు అనేది వారి గురించి వారు తెలుసుకుంటారు అని తెలియజేశారు. ఉద్యోగం అనేది మనం కచ్చితంగా చేయాలనే పని కాదు మనం ఏంటి అనేది నిరూపించుకోవడం. ఇప్పుడు జరుగుతున్న ముఖాముఖిని మీరందరూ అనుభూతి చెంది మరెన్నో ముఖాముఖిలను ఎదుర్కొండి. ఇప్పుడు ఈ ముఖాముఖి కోసం సమావేశమైనటువంటి విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్లోబల్ టాక్సెస్ హెచ్ ఆర్ కళ్యాణి మాట్లాడుతూ ఇంత మంచి అవకాశాన్ని కలిగించినటువంటి శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల వారికి సింక్రియన్ సంస్థ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం మేము ఇక్కడికి వచ్చి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాము మీ అందరికీ మా సంస్థ అంటే ఏంటి ఆ సంస్థల మీరు ఏం చేస్తారు అనే అంశాలను మీరు తెలుసుకోవాల్సి ఉంటుంది. మాకు చాలా నైపుణ్యం ఉన్నాం విద్యార్థులు కావాలి ఈ ముఖాముఖిని ఎదుర్కోవటానికి వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థికి శుభాకాంక్షలు. మా సంస్థ హైదరాబాద్ లోనే కాకుండా బెంగళూరులో కూడా ఉంది. మీ ఇంట్లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా మీ తల్లిదండ్రులని మేము ఒప్పించి మీకు ఉద్యోగ అవకాశం కలిగిస్తాము అని హామీ ఇచ్చారు. ఈ సంస్థలో ఆరు నెలలు రాత్రి ఉద్యోగం మరియు ఆరు నెలలు పగలు ఉద్యోగం అనేది ఉంటుంది. ఈ సంస్థ ద్వారా మీకు ఆహారం మరియు ఇతర తినుబండారాలు మీకు కంపెనీ కలిగిస్తుంది. ఈ ముఖాముఖిలో అందరికీ వారి గురించి వారు పరిచయం చేసుకోవాల్సి ఉంటుంది వారు ఎక్కడ పుట్టారు వారి ప్రాంతం ఏంటి వారు ఏం చదువుతున్నారు వారి తల్లిదండ్రుల పేరు అని వివరాలు ఉంటాయి. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థి ముఖం మీద చిరునవ్వులతో ఈ ముఖాముఖిని ఎదుర్కోవాలి అని తెలియజేశారుఆదిత్య మాట్లాడుతూ ఈ సంస్థలు కెనడా ఇండియా యుఎస్ ఈ మూడు దేశాల అనుసంధానం కలిగి ఉన్న సంస్థ. వీటి సమయపాలనను బట్టి మీ ఉద్యోగ సమయం నిర్ణయించబడుతుంది అని తెలియజేశారు. మీరు చిన్నప్పటినుంచి చదివిన చదువు ఈ ఉద్యోగం సంపాదించడానికి కదా ఇప్పుడు సమయం వచ్చింది మీరు ఏంటి అనేది ఇతరులకు నిరూపించుకోవడానికి. ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని మీరు ఏంటి మీరు అనుకుంటే ఏం చేయగలరు అనేది నిరూపించుకోండి. ఇంత మంచి అవకాశాన్ని కలిగించినటువంటి శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాల వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ డా.జి .హేమంత్ రెడ్డి మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉంది. మహా ఉద్యోగ సమ్మేళనం మన కళాశాలలో నిర్వహించినందుకు సింగ్ సమస్త వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 15 సంవత్సరాల నుంచి కళ్యాణి గారు సింగరేణి సంస్థ నుండి మన విద్యార్థుల ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు కలిగిస్తూ వారిని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటూ ఉన్నారు. అవకాశాలు అనేటివి చాలా తక్కువగా ఉన్నాయి వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని వాటి నుంచి మనం ఎంతో కొంత నేర్చుకొని మన జీవితాన్ని ఇంకా గొప్ప స్థాయికి తీసుకువెళ్లాలి. చాలా కష్టపడి చదివి ఇంతవరకు వచ్చారు మీ భవిష్యత్తులో ఎలా ఉండాలి? ఏ దారిలో వెళ్లాలి అలాగే ఏ సంస్థలకు ఉద్యోగ అవకాశాన్ని సంపాదించి మన జీవితాన్ని విజయవంతం చేసుకోవాలి అనేది మీ చేతుల్లోనే ఉంది దీని ద్వారా మీ తల్లిదండ్రులు మోహంలో కూడా మీరు సంతోషాలను చూడగలుగుతారు. మీ నైపుణ్యాలను ప్రదర్శించి మీరు ఏంటో నిరూపించుకోవడానికి ఇంకా కొన్ని గంటల సమయం ఉంది అని తెలియజేశారు.





# జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పూర్వ విద్యార్థుల చేయూత.

**రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన 6 మందికి రూ.12 వేల ఆర్థిక సాయం.**

**వెలుగోడు అక్టోబర్ 07 నంది పత్రిక:** వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికై పాఠశాలకు ఘనత తెచ్చారు. వీరిలో కబడ్డీ విభాగంలో జి. హర్షవర్ధన్, సత్యనారాయణ, జూడో అండర్-14 విభాగంలో ఆఫ్రోజ్, జూడో అండర్-19 విభాగంలో మహాదేవి, ఫెన్సింగ్ విభాగంలో ఫైజన్, రేహాన్ లు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ముందుకు వచ్చింది. ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున మొత్తం రూ.12,000 ల చెక్కును బుధవారం పాఠశాలలో హెచ్ఎం ఫిజికల్ డైరెక్టర్లు చేతుల మీదుగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మాలిక్ ఖాన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వకారణమని, పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు రంగన్న, మోహన్, కోచ్ అబ్దుల్ వాహీద్, ఉపాధ్యాయులు ఎం.ఎం.డి. ఫైజుల్లా, శేషశైన శర్మ, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు జయరామిరెడ్డి, నషారుల్లా ఖాన్, శ్రీనివాసులు, నారాయణ, అబ్దుల్లా బేగ్, సుల్తాన్ మొహిద్దిన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయికి అర్హత సాధించి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకుఎంపికైన క్రీడాకారులకు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపి, రాష్ట్రస్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు.



# చెత్త ద్వారా సంపాద సృష్టించండి






## 1000 కేజీల వర్మీ కంపోస్ట్ తయారీ లక్ష్యం

## పిడిఓల శిక్షణలో డి ఎల్ డి వో అన్వారా బేగం

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 7:** సచివాలయ పరిధిలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో ఈ నెలాఖరుకు 1000 కిలోల వర్మీ కంపోస్టు తయారీకి లక్ష్యంగా పెట్టుకోవాలని ఆత్మకూరు డి ఎల్ డి ఓ అన్వరా బేగం అన్నారు. బుధవారం బండి ఆత్మకూరు చెత్త సంపద తయారీ కేంద్రంలో వెలుగోడు, బండి ఆత్మకూరు మండలాలకు చెందిన పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు, హరిత రాయబారులకు వర్మీ కంపోస్టు తయారీపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్డిఓ అన్వరా బేగం మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రతి పంచాయతీలో వర్మీ కంపోస్టు తయారుచేసి సిద్ధంగా ఉంచాలని అన్నారు. చెత్త సంపద కేంద్రాలు లేని చోట సిమెంట్ రింగులు ఏర్పాటు చేసుకోవాలని పిడిఓలకు సూచించారు. సిమెంటు రింగులు ఏర్పాటు చేసుకోలేని పక్షంలో దిబ్బగుంతల మాదిరి గుంతలను తవ్వకొని వర్మీ కంపోస్టు తయారీకి పూనుకోవాలని అన్నారు. గ్రామాలలో తడి చెత్తను సేకరించడంలో హరిత రాయబారులు శ్రద్ధ వహించాలని, ఈ విషయంలో అలసత్వం వహించే రాయబారులపై కార్యదర్శులు దృష్టి సారించాలని డిఎల్డీవో పేర్కొన్నారు. గ్రామాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం నూతనంగా దసరా ధమాకా కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గత నెల 25 వ తేదీ నుండే ప్రారంభమైందని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు స్వచ్ఛరథం వచ్చినప్పుడు ప్రజలు 10 కేజీలకు తగ్గకుండా పొడి చెత్తను అందిస్తే, అటువంటి వారికి ప్రత్యేకంగా కూపన్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. దసరా పండుగ అనంతరం కూపన్లు అన్నింటిని లక్కీ డ్రా గా తీసి విజేతలకు బహుమతులను ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. నిర్దేశించిన ప్రకారం గ్రామాలకు స్వచ్ఛరథం వచ్చినప్పుడు కార్యదర్శులు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. మండలంలో స్వచ్ఛరథం వచ్చినప్పుడు ఎంపీడీవో ప్రత్యేకంగా అన్ని గ్రామాలలో పర్యవేక్షణ చేసి దసరా ధమాకా కార్యక్రమం విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

**జీతాల పెండింగ్ పై డి ఎల్ డి వో అసహనం**

బండి ఆత్మకూరులో హరితరాయబారుల జీతాల చెల్లింపు విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల డి ఎల్ డి ఓ అసహనం వ్యక్తం చేశారు. తమకు పది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని హరిత రాయబారులు డిఎల్డీవోతో మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై డిఎల్డిఓ మాట్లాడుతూ పంచాయతీ సర్పంచుల పదవీకాలం పూర్తి అయ్యేనాటికే అన్ని బిల్లులకు సంబంధించి క్లియరెన్స్ చేసుకోవాలని అన్నారు. పది నెలల నుండి గ్రామంలో హరిత రాయబారులకు జీతాలు ఎందుకు చెల్లించ లేదు అన్న విషయంపై తాను విచారణ జరుపుతానని పేర్కొన్నారు. పంచాయతీలో ఉన్న నిధులు ఇతర పనులకు ఏమైనా వినియోగించారా? అన్న విషయంపై తాను విచారణ నిర్వహిస్తానని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలలో హరిత రాయబారులకు ప్రతినెల జీతాలు కచ్చితంగా ఇచ్చి తీరాలని పంచాయతీ కార్యదర్శులను డిఎల్డిఓ అన్వరాబేగం ఆదేశించారు.



# అంతరిక్ష విజ్ఞానాన్ని అధ్యయనం చేసి సృజనాత్మక ఆవిష్కరణలకు విద్యార్థులు బాటలు వేయాలి




## ప్రయోగాత్మక అభ్యసనం, పరిశోధనా దృక్పథంతో భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

## అంతరిక్ష సాంకేతికతతో ప్రజలు, రైతులకు విస్తృత ప్రయోజనాలు

## జిల్లాలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, అక్టోబరు 07(నంది పత్రిక):-** అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించుకొని, ప్రయోగాత్మక అభ్యసనం, పరిశోధనా దృక్పథంతో విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. బుధవారం నంద్యాల పట్టణంలోని ఎస్.వి.ఆర్. ఇంజనీరింగ్ కళాశాలలో ఇస్రో శాస్త్రవేత్తల బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, 'రాకెట్ రివల్యూషన్' థీమ్‌తో అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా నంద్యాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని అన్నారు. దక్షిణ భారతదేశంలో ఇస్రో ఎంపిక చేసిన ఆరు కార్యక్రమ వేదికల్లో నంద్యాల కూడా చోటు దక్కించుకోవడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు నిశ్శబ్దంగా, నిరంతర కృషితో దేశ అంతరిక్ష రంగంలో విశేష పురోగతిని సాధిస్తూ దేశాభివృద్ధికి కీలకంగా సేవలందిస్తున్నారని కలెక్టర్ కొనియాడారు. విద్యార్థులు చదువును తరగతి గదులకే పరిమితం చేయకుండా ప్రయోగాలు, ప్రాక్టికల్స్, పరిశీలన, అన్వేషణ ద్వారా జ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి అంతరిక్ష శాస్త్రవేత్తలుగా ఎదిగి కమ్యూనికేషన్ వ్యవస్థలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, అధునాతన రాకెట్ సాంకేతికతలను అభివృద్ధి చేసే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, నిరంతర శ్రమను అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. అంతరిక్ష సాంకేతికత సామాన్య ప్రజల జీవన విధానంలోనూ కీలక పాత్ర పోషిస్తోందని కలెక్టర్ వివరించారు. వాతావరణ పరిస్థితుల అంచనా, తుఫానులు, వరదలపై ముందస్తు హెచ్చరికలు, కమ్యూనికేషన్ వ్యవస్థలతో పాటు వ్యవసాయ రంగంలో నేల తేమ, పంటల పరిస్థితి, సాగుకు సంబంధించిన సమాచారాన్ని అందించడంలో అంతరిక్ష సాంకేతికత ఎంతో ఉపయోగపడుతోందన్నారు. భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు క్రమశిక్షణతో నిరంతరం శ్రమించాలని కలెక్టర్ ఉద్బోధించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆలోచనలకు శ్రీకారం చుట్టి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన వివిధ పాఠశాలల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మెమొంటోలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో షార్ (షార్) ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శంకరన్, ఇస్రో సీనియర్ సైంటిస్ట్ టి. శ్రీనివాసరెడ్డి, సైంటిస్ట్ ఆదిత్య తదితర ఇస్రో శాస్త్రవేత్తలు, ఎస్.వి.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# పురుషుడిలో ఆడవారిలాగా వక్షోజాల పరిమాణం సరి చేసిన కిమ్స్ కర్నూలు వైద్యులు

## పురుషుల్లో ఛాతీ పెరుగుదలకు శస్త్ర చికిత్సతో పరిష్కారం

## 27 ఏళ్ల యువకుడికి విజయవంతంగా చికిత్స

## ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స మొత్తం ఉచితం

**కర్నూలు సిటీ నంది పత్రిక** అసాధారణ రీతిలో ఆడవారిలాగా వక్షోజాలు పెరిగి ఇబ్బంది పడుతున్న ఓ యువకుడికి కిమ్స్ హాస్పిటల్స్ కర్నూలు వైద్యులు శస్త్ర చికిత్స ద్వారా ఉపశమనం కలిగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రి వైద్యులు కన్సల్టెంట్ ప్లాస్టిక్ సర్జన్ డా నవ్య వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన 27 ఏళ్ల యువకుడికి కుడివైపు ఛాతీ భాగం ఎడమవైపు కంటే ఎక్కువగా పెరిగి ఉండటంతో ఆయన ఇబ్బంది పడుతున్నారు. టీషర్టులు ధరించడంతోపాటు బహిరంగ ప్రదేశాలు, సామాజిక కార్యక్రమాలకు వెళ్లేటప్పుడు అసౌకర్యంగా ఉండేది. దీంతో మానసికంగా ఇబ్బంది పడ్డారని తెలిపారు. సర్జరీ కోసం పలు ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోవడంతో శాశ్వత పరిష్కారం కోసం కిమ్స్ హాస్పిటల్ కు వచ్చి వైద్యులను సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం ఛాతీలో పేరుకుపోయిన అదనపు కొవ్వును తొలగించేందుకు ఇరువైపులా లైపోసక్షన్ నిర్వహించారు. కుడివైపు ఉన్న అదనపు గ్రంథి కణజాలాన్ని తొలగించేందుకు సబ్‌క్యూటేనియస్ మాస్టెక్టమీ చేశారు. దీంతో ఛాతీ ఆకృతి సహజంగా, సమతుల్యంగా మారింది. శస్త్రచికిత్స అనంతరం మరుసటి రోజు నుంచే రోగి సాధారణంగా నడవగలిగారని వైద్యులు తెలిపారు. ఎలాంటి సమస్యలు లేకుండా కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. పురుషుల్లో గైనకోమాస్టియా సాధారణంగా కనిపించే సమస్యేనని తెలిపారు. అయితే ఛాతీ పెరుగుదల కారణంగా కొందరిలో ఆత్మవిశ్వాసం తగ్గడంతోపాటు దుస్తులు ధరించడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడంలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.

ఛాతీలో కొవ్వు అధికంగా ఉంటే లైపోసక్షన్, గ్రంథి కణజాలం ఎక్కువగా ఉంటే శస్త్రచికిత్స ద్వారా దాన్ని తొలగించడం చేస్తామని తెలిపారు. అవసరాన్ని బట్టి రెండు విధానాలను కలిపి నిర్వహించడం ద్వారా మెరుగైన ఆకృతిని సాధించవచ్చన్నారు. సరైన వైద్య అంచనా, ప్రణాళికతో గైనకోమాస్టియాకు సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రోగికి చికిత్స అందించారు.



# న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం- మంత్రి ఫరూక్ స్పష్టీకరణ



**అమరావతి,అక్టోబరు 07. నంది పత్రిక:**రాష్ట్రంలోని న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయం మూడవ బ్లాక్ లోని పేషీ కార్యాలయంలో మంత్రి ఫరూక్ ను పశ్చిమ గోదావరి జిల్లా బార్ ఫెడరేషన్, ఒంగోలు బార్ అసోసియేషన్, హిందూ లాయర్స్ ఫోరం మరియు ఇతర లాయర్ల బృందాల సభ్యులు కలిశారు. న్యాయవాదుల రక్షణ బిల్లు, న్యాయమిత్ర, అడ్వొకేట్ వెల్ఫేర్ ఫండ్, హెల్త్ కార్డులు తదితర పథకాలను అమలు చేయాలని మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ బిల్లు-2026( ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్ -2026)ను రూపొందించడానికి కూటమి ప్రభుత్వం ఇదివరకే కార్యాచరణ చర్యలకు ఉపక్రమించిన విషయాన్ని గుర్తు చేశారు. ముసాయిదాను వీలైనంత త్వరగా తయారు చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. త్వరలో ముసాయిదా బిల్లు ఆమోదం కోసం మంత్రి మండలి సమావేశం ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని మంత్రి ఫరూక్ న్యాయవాదుల బృందంతో చెప్పారు. న్యాయవాదుల సంక్షేమానికి, రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరణించిన 1173 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు ప్రకారం మొత్తం రూ. 46.92 కోట్లు ఆర్థిక సాయం ను కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు.

# ఇళ్లు మంజూరైనా.. సదుపాయాలు కరువు.. జగనన్న కాలనీ వాసుల ఆవేదన




**పోరుమామిళ్ల, అక్టోబర్ 7 ( నంది పత్రిక ):**వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల కాల్వకట్ట ప్రాంతంలోని జగనన్న కాలనీని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ సభ్యులు సందర్శించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో సుమారు 70 నుంచి 80 ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 12 కుటుంబాలు మాత్రమే అక్కడ నివాసం ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు.కాలనీకి సరఫరా అవుతున్న నీటిని పక్కనే ఉన్న రాజీవ్ నగర్‌కు చెందిన కొందరు వాల్ తిప్పడంతో తమకు నీరు అందడం లేదని స్థానికులు ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు.అదేవిధంగా కాలనీలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో తేళ్లు, పాములు, ఇతర కీటకాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్లే చాలామంది లబ్ధిదారులు కాలనీలోకి వచ్చి నివాసం ఉండలేకపోతున్నారని స్థానికులు తెలిపారు.ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు కాలనీలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి సహకరించాలని కోరారు. ముఖ్యంగా తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించి, ప్రజలు సురక్షితంగా నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలనీకి నిరంతర నీటి సరఫరా అందించడంతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేసి, మిగిలిన అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ ఫణి రావు, ఆఫీస్ సెక్రటరీ కె. ప్రవీణ్ బాబు, ఆర్గనైజర్ సెక్రటరీ శ్రీను కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

# వెలుగోడు పంపు హౌస్ నీరు సురక్షితం

## అధికారుల సమక్షంలో నీటి నాణ్యతా పరీక్షలు

## వివరణ ఇచ్చిన పంప్ హౌస్ నిర్వాహకులు, క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్, హుస్సేన్



**వెలుగోడు: నంది పత్రిక (అక్టోబర్ 07)** వెలుగోడులోని స్థానిక పంపు హౌస్ నీటి సమస్యపై ఇటీవల ఎస్డిపిఐ పార్టీ నాయకులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ విషయమై 'నంది పత్రిక' విలేకరి అడిగిన ప్రశ్నలపై పంప్ హౌస్ నిర్వాహకులు, క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్ మరియు హుస్సేన్ స్పందించారు. సమస్యను తీవ్రంగా పరిగణించి వెంటనే సంబంధిత అధికారులను క్షేత్రస్థాయికి పిలిపించి, వారి ముందటే నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి స్పష్టమైన వివరణ ఇచ్చారు. ప్రత్యేక ల్యాబ్ టెక్నీషియన్‌తో నిర్వహించిన ఈ పరిశీలనలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మరియు ఫిర్యాదు చేసిన ఎస్డిపిఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ నిర్వహించిన ఫిల్టరైజేషన్, క్లోరినేషన్ పరీక్షల్లో తాగునీరు పూర్తిగా సురక్షితమైనదిగా ప్రాథమికంగా నిర్ధారణ అయిందనిఅలాగే ఫిల్టర్ బెడ్ లు మార్చడం కోసం ఎస్టిమేషన్ వేయించామని త్వరలో అది కూడా మారుస్తామని పంప్ హౌస్ నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా, బ్యాక్టీరియాలాజికల్ పరీక్షల నిమిత్తం నీటి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించామని, రెండు రోజుల్లో దానికి సంబంధించిన సమగ్ర నివేదిక వస్తుందని అధికారులు వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పరిశుభ్రమైన నీటిని అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు.

# వందేభారత్-అమృత భారత్ రైళ్ల మధ్య తేడాలు.. వేగం, ఛార్జీలు, సౌకర్యాల్లో తేడాలివే!

భారతీయ రైల్వే తన నెట్‌వర్క్‌ను ఆధునికీకరించే ప్రక్రియలో భాగంగా ప్రయాణికులకు వైవిధ్యమైన సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇందులో భాగంగా ప్రీమియం ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని 'వందే భారత్' రైళ్లను, సామాన్య ప్రయాణికుల కోసం తక్కువ టికెట్ ధరలో 'అమృత్ భారత్' రైళ్లను నడుపుతోంది.

# విద్యార్థులు లక్ష్య సాధనకు క్రమశిక్షణతో కృషి చేయాలి





## మెనూ ప్రకారం భోజనం అందించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో కష్టపడి చదివి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విద్యార్థులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న బీసీ సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ వసతి గృహంలో మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నారా, భోజనం రుచిగా ఉంటుందా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. విద్యార్థులు స్పందిస్తూ మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నారని, భోజనం రుచిగా ఉంటుందని కలెక్టర్ కి తెలిపారు. వసతి గృహంలో నీటి నిల్వకు ఇబ్బందులు ఉన్నాయని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, అదనంగా మున్సిపల్ వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అనంతరం చదువు ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ పదో తరగతి విద్యార్థులు తమ చదువుపై ప్రత్యేక దృష్టి సారించి మంచి మార్కులు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలని తెలిపారు. చదువుతో పాటు సమయపాలన, క్రమశిక్షణ కూడా అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడతారని, వారి కలలను నెరవేర్చే విధంగా విద్యార్థినులు కష్టపడి చదవాలని సూచించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాదని, విద్య ద్వారా మంచి ఉద్యోగాలు, ఉన్నత అవకాశాలు సాధించి తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మార్చుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే వరకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్యను కొనసాగించి, తమ కాళ్లపై తాము నిలబడాలని ప్రోత్సహించారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ధైర్యాన్ని కోల్పోకూడదని, ఆత్మ విశ్వాసంతో జీవితంలో ముందడుగు వేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను ఏమైనా ఉంటే వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ బీసీ సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ వంట గదిని పరిశీలిస్తూ సాంబార్ కొంచెం పల్చగా ఉందని, కొంచెం పప్పు ఎక్కువగా వేసి రుచిగా చేయాలని కలెక్టర్ వంట సిబ్బందిని ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన పాల్గొన్నారు.

# దేవరగట్టు బన్ని ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### ఉత్సవాల నిర్వహణకు వీలుగా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి

### కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** దేవరగట్టు బన్ని ఉత్సవాలను ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దేవరగట్టు బన్ని ఉత్సవాల ఏర్పాట్ల పై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, హోళగుంద, హాలహర్వి, ఆలూరు మండలాల అధికారులు, సంబంధిత గ్రామాల పెద్దలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఏర్పాట్లపై సమీక్షించారు

**జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...** ఉత్సవ ప్రాంతం, ఆలయ పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వాటర్ ట్యాంకులు, భవనాలు, చెట్లపైకి ఎక్కకుండా బారికేడింగ్, పోలీసు బందోబస్తు పటిష్టం చేయాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, వైద్య, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు అధికారులు, తహశీల్దార్లు కలిసి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు ముందుగా వెళ్లి అవసరమైన ఏర్పాట్లను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని తెలిపారు. గత సంవత్సరాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఈసారి ఏర్పాట్లను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. దేవరగట్టు, నెరణికి తాండా, కొత్తపేట గ్రామాలకు వెళ్లే ప్రధాన మార్గాల్లో గుంతలను గుర్తించి ఉత్సవానికి ముందే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. శాశ్వత పనులు పూర్తయ్యే వరకు అవసరమైన తాత్కాలిక మరమ్మతులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఆలయ పరిసరాలు, రద్దీ ప్రాంతాలు, చీకటి ప్రదేశాల్లో తగినంత లైటింగ్, మైక్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట టార్చ్ లైట్లు, ఇతర లైటింగ్ పరికరాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట జనరేటర్లు ఏర్పాటు చేయాలని ఎస్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీ దృష్ట్యా పారిశుద్ధ్య సిబ్బందిని అవసరమైన షిఫ్టుల్లో అందుబాటులో ఉంచి, తగిన సంఖ్యలో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, అవసరమైన చోట భద్రతా ఏర్పాట్లకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించేందుకు సంబంధిత అనుమతులను త్వరగా పొందాలని ఆదేశించారు. ఉత్సవ సమయంలో అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దేవరగట్టు 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ డీఎంహెచ్‌ఓ ను ఆదేశించారు. అంబులెన్స్ లు, అదనపు స్ట్రెచర్లు, వీల్‌చైర్లు, మందులు తగినంతగా సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రతి అంబులెన్స్ కు అదనంగా 67 స్ట్రెచర్లు అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో త్వరగా తరలించేలా అంబులెన్సులకు ప్రత్యేక ఎగ్జిట్ మార్గాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ, అనస్థీషియా, జనరల్ సర్జరీ తదితర వైద్య నిపుణులతో పాటు స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రుల వద్ద రోగులతో వచ్చే వారి రద్దీని నియంత్రించేందుకు పోలీసు సిబ్బంది, ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉత్సవానికి వచ్చే భక్తులకు తాగునీటి కొరత లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సమృద్ధిగా నీటి వసతులు కల్పించాలని ఆదేశించారు. అగ్నిప్రమాదాలను నివారించేందుకు తగిన సంఖ్యలో ఫైర్ టెండర్లను సిద్ధంగా ఉంచాలని, ఇరుకైన మార్గాల్లోకి వెళ్లగల చిన్న ఫైర్ టెండర్లను కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఉత్సవ సమయంలో డ్రై డేస్ అమలు, అక్రమ మద్యం రవాణా, నిల్వలు, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామస్థాయిలో వీఆర్ఏలు, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది, ఇతర సిబ్బంది ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఉత్సవ సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉత్సవ నిర్వహణలో భద్రత, ప్రజల అవగాహన, శాఖల మధ్య సమన్వయం ప్రధాన అంశాలుగా తీసుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు.

**జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ..** గతంలో బ్లాక్ స్పాట్ ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాల్లో తగినంత లైటింగ్ లేకపోవడంతో, ఈసారి ఆయా ప్రాంతాల్లో అదనపు లైటింగ్ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దేవరగట్టు పరిసర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచి, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఇరుకుగా ఉన్న రహదారులను గుర్తించి అవసరమైన మరమ్మతులు, సరిదిద్దే పనులను చేపట్టాలని, రోడ్లు ఇరుకుగా ఉన్న ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో లోపలికి వెళ్లేందుకు వీలుగా చిన్న పరిమాణంలో అగ్నిమాపక వాహనాలు, పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎక్సైజ్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేసి నాటుసారా, అక్రమ మద్యం నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కర్రలకు ఇనుప రింగులు అమర్చిన వాటిని ముందుగానే గుర్తించి స్వాధీనం చేసుకోవాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఉత్సవ ప్రాంతంలోని పాత, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి, వాటిపైకి ప్రజలు ఎక్కకుండా భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉత్సవాల్లో దివిటీలను విసరడం జరుగుతోందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ అంశాల్లో గ్రామస్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ రెవెన్యూ,పోలీస్ అధికారులను ఆదేశించారు. దేవరగట్టు ఉత్సవ ప్రాంతం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వ్యక్తులను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి, నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాల నిఘా, భద్రతా చర్యలపై ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించాలని సూచించారు. బన్ని ఉత్సవం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా గ్రామస్థులు, భక్తులు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ కోరారు. అనంతరం శ్రీశ్రీ శ్రీ మాళ సహిత మల్లేశ్వర స్వామి దసరా ఉత్సవముల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, ఆదోని ఆర్డీవో అరుణ దేవి, పాల్గొన్నారు.

# పోరుమామిళ్ల ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి



### పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

**పోరుమామిళ్ల, అక్టోబర్ 7 (నంది పత్రిక):** పోరుమామిళ్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి సందర్శించి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న పరికరాలు, వైద్యులు, సిబ్బంది వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పోరుమామిళ్ల ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆస్పత్రిని 50 పడకల స్థాయికి అభివృద్ధి చేసి, బిల్డింగ్‌తో పాటు అవసరమైన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రికి మొత్తం 12 మంది వైద్యుల పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం ఏడుగురు వైద్యులు మాత్రమే పనిచేస్తున్నారని, మిగిలిన ఖాళీ పోస్టులను కూడా ప్రభుత్వం భర్తీ చేయాలని కోరారు ప్రస్తుతం ఆస్పత్రిలో ఎక్స్‌రే, ఫోటో థెరపీ, చిన్నపిల్లలకు సంబంధించిన వైద్య సేవలు, ఈసీజీ, కుక్కలు, కోతులు, పిల్లులు కరిచిన వారికి అవసరమైన ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గుండె సంబంధిత అత్యవసర చికిత్సకు ఉపయోగించే ఖరీదైన ఇంజక్షన్లు కూడా అందుబాటులో ఉన్నాయని, రక్తం సైతం లభిస్తుందని పేర్కొన్నారు. డెంటల్, కంటి వైద్య సేవలతో పాటు గైనకాలజీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రసవాలు నిర్వహించడంతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా చేస్తున్నట్లు తెలిపారు. పోరుమామిళ్ల చుట్టుపక్కల మూడు మండలాల ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆస్పత్రిని వినియోగించుకోవాలని నాగార్జున రెడ్డి సూచించారు. గత 25 సంవత్సరాలుగా ఎంపీపీగా, జడ్పీటీసీగా, ముఖ్యమంత్రి సలహాదారుగా వివిధ హోదాల్లో ఉన్న సమయంలో ఆస్పత్రిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన మందులు, వైద్య పరికరాలు, వైద్యులు, సిబ్బంది, ఖాళీ పోస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేసినట్లు నాగార్జున రెడ్డి తెలిపారు.



# ఘనంగా జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ పుట్టినరోజు వేడుకలు

### ఏఐసీసీ సభ్యులు కర్నూల్ జిల్లా ఇంచార్జ్ నంద్యాల మాజి డీసీసీ అధ్యక్షులు పాణ్యం నియోజకవర్గ కోఆర్డినేటర్



**కర్నూలు సిటి నంది పత్రిక** కర్నూలు, నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ నాయకులు మొత్తం భారీ ఎత్తున హాజరై జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ జన్మదిన వేడుకలు వారి స్వగృహం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల బొకేలతో, శాలువలతో లక్ష్మినరసింహ యాదవ్ ని సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో విరజిల్లాలని అందరు ఆకాంక్షించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని నాయకులు కొనియాడారు. కర్నూలు నంద్యాల పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో లక్ష్మినరసింహ యాదవ్ ముందుండాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుని జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రజల కోసమే పోరాటం కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతర కృషి మనమందరం రాహుల్ గాంధీ ని ప్రధానిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన కర్నూల్ & నంద్యాల కాంగ్రెస్ పార్టీ నాయకులకు పేరు పేరున ధన్యవాదములు తెలియజేశారు. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉండి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని జెంగిటి లక్ష్మినరసింహ యాదవ్ పేర్కొన్నారు. ఈ పుట్టినరోజు కార్యక్రమం కర్నూలు, నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గ నాయకులు, మండలాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హోర్డింగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో హోర్డింగుల ఏజెన్సీలు తమ బకాయిలను వెంటనే చెల్లించాలని నగం పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో హోర్డింగుల ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, చెల్లించకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగులకు ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. బకాయిలను వెంటనే చెల్లించకపోతే అనధికార హోర్డింగులుగా పరిగణించి తొలగిస్తామని హెచ్చరించారు. కార్పొరేషన్ ఆదాయానికి గండి వేస్తే సహించబోమని కమిషనర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీసీపీ శబ్నం శాస్త్రీ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# మహానంది పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదానానికి రూ. 10,116 విరాళం



**మహానంది అక్టోబర్ 07 (నంది పత్రిక):-** మహానంది పుణ్యక్షేత్రంలో కొనసాగుతున్న శ్రీ మహానందీశ్వర స్వామివారి నిత్యాన్నదాన పథకానికి భక్తుడు విరాళం అందించారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కొండమాల చక్రపాణి, తన తండ్రి కొండమాల కొండయ్య జ్ఞాపకార్థం రూ. 10,116/- విరాళాన్ని ఆలయ అధికారులకు సమర్పించారు. దాత చక్రపాణిని ఆలయ పర్యవేక్షకుడు సుబ్బారెడ్డి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ,నిత్యాన్నదానానికి సంబంధించిన బాండుతో పాటు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# శ్రీ మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కృషి.

### దేవాదాయ శాఖ మంత్రి కి,మరియు కమిషనర్‌కి వినతి.



**బేతంచెర్లఅక్టోబర్7(నందిపత్రిక).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం శ్రీ మద్దులేటి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా, దేవస్థానానికి అవసరమైన వివిధ అభివృద్ధి పనులపై విజయవాడలోఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణ రెడ్డిని మరియు దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ని, నంద్యాల జిల్లా,డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి మరియు శ్రీ మద్దులేటి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం చైర్మన్ ఉన్నం ఎల్ల నాగయ్యలు కలిసివినతి పత్రం బుధవారం సమర్పించారు. ప్రధానంగా దేవస్థానంలో ఉత్తర రాజగోపురం నిర్మాణం కోసం అవసరమైన మార్గం అభివృద్ధి, ప్రాకార నిర్మాణం మరియు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఇతర అభివృద్ధి పనులకు,అవసరమైనసహకారం,అనుమతులు మరియు నిధులు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా శ్రీ మద్దులేటీ లక్ష్మి నరసింహ స్వామి, శ్రీ మహాలక్ష్మి అమ్మ వార్ల చిత్ర పఠము మరియు ప్రసాదాలను దేవాదాయ మంత్రి కి, దేవాదాయ శాఖ కమిషనర్ కి సమర్పించద మైనది. దేవస్థాన అభివృద్ధికి సంబంధించిన అంశాలను సానుకూలంగా పరిశీలించిన మంత్రి శ్రీ ఆనం నారాయణ రెడ్డి మరియు కమిషనర్ కె.రామచంద్ర మోహన్,తగిన చర్యలు తీసుకుని శ్రీ మద్దిలేటి నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. భక్తుల సౌకర్యాలు,దేవస్థాన అభివృద్ధి మరియు ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించే దిశగా, ఈచర్యలు కీలకంగా నిలుస్తాయని దేవస్థానం ప్రతినిధులు తెలిపారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం






## పల్లె పండుగ కింద గ్రామాల్లో అభివృద్ధి పనులు

## మరో 14 ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు

## ప్రజా అవసరాల ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబరు 7 నంది పత్రిక** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజల నుంచి అందిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం ఆళ్లగడ్డ మండలం జంబులదిన్నె గ్రామంలో ముస్లిం, ఎస్సీ స్మశాన వాటికలకు వెళ్లే మార్గంలో చిన్న ఏరుపై రూ.60 లక్షలతో నిర్మించిన కల్వర్టును, కోటకందుకూరు గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జంబులదిన్నె గ్రామంలోని ముస్లిం, ఎస్సీ స్మశాన వాటికలకు వెళ్లే మార్గంలో చిన్న ఏరు దాటేందుకు సౌకర్యం లేక మృతదేహాలను నీటిలో నుంచి తీసుకెళ్లాల్సి వస్తున్న పరిస్థితికి సంబంధించిన ఫోటోను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తన దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించి రూ.60 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, ప్రస్తుతం ఆ నిర్మాణం పూర్తయిందని వివరించారు. ఇదే తరహా సమస్యలు ఉన్న మరో 14 ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణానికి నిధులు కేటాయించామని, పనులను వేగవంతంగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జంబులదిన్నె గ్రామంలో పల్లె పండుగ 1.0, 2.0 కింద ఇప్పటికే రూ.70 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టగా, పల్లె పండుగ 3.0 కింద మరో రూ.20 లక్షల పనులకు నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన తాగునీరు, రహదారులు, పాఠశాలల ప్రహరీ గోడలు తదితర సామూహిక అవసరాలకు సంబంధించిన వినతులను కూడా ప్రాధాన్యతతో పరిశీలించి, అవసరమైన నిధులు సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. గ్రామస్థులు తమ ప్రాంతానికి అవసరమైన ఇతర అభివృద్ధి పనులను అధికారుల దృష్టికి తీసుకువస్తే, వాటికి అంచనాలు రూపొందించి నిబంధనల మేరకు దశలవారీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కోటకందుకూరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, కల్వర్టులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పల్లె పండుగ 1.0, 2.0 కింద కోటకందుకూరు గ్రామానికి ఇప్పటికే రూ.50 లక్షలు మంజూరు చేయగా, పల్లె పండుగ 3.0 కింద సీసీ రోడ్డు నిర్మాణానికి తాజాగా రూ.40 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సూచించిన మేరకు గ్రామంలో అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అంచనాలు సిద్ధం చేయాలని, తదనుగుణంగా నిధుల మంజూరుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్మించిన మౌలిక వసతులను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు, వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ, జంబులదిన్నె గ్రామంలో పల్లె పండుగ 1, 2, 3 విడతల కింద దాదాపు రూ.95 లక్షల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మృతదేహాన్ని నీటిలో నుంచి తీసుకెళ్లాల్సిన పరిస్థితికి సంబంధించిన ఫోటోను చూసిన వెంటనే స్పందించి కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జంబులదిన్నె గ్రామంతో పాటు ఎస్సీ కాలనీ సహా ఇలాంటి సమస్యలు ఉన్న మొత్తం 14 ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే కందుకూరు రహదారి అధ్వానంగా ఉన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమం ద్వారా నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ప్రతి సమస్యను ఓపికగా విని, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ నిరంతరం ఫాలోఅప్ చేసి, అవసరమైన నిధులు కేటాయించి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న జిల్లా కలెక్టర్ జి. రాజకుమారికి ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.






# కల్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కాటసాని డిమాండ్




## రైతుల పక్షాన కాటసాని రామభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ

**కర్నూలు సిటీ నంది పత్రిక** నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు మండల రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బిర్లా గేట్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలవేసి నివాళులర్పించి, జిల్లా కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు.

**అనంతరం రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు.**

ఈ సందర్భంగాకాటసాని రామభూపాల్ రెడ్డి మాట్లాడుతూ పంటలు కళ్లముందే ఎండిపోతుంటే కరువు లేదని ఎలా చెబుతారు అని కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రశ్నించారు. ఎల్-నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, కల్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. వర్షాలు సకాలంలో కురుస్తాయని ఆశతో రైతులు పెట్టుబడులు పెట్టి సాగు ప్రారంభించారని, పంట ఒక దశకు వచ్చే వరకు కూలీల ఖర్చులు, విత్తనాలు, ఎరువులు తదితర వాటిపై భారీగా ఖర్చు చేశారని తెలిపారు. చివరకు కీలక దశలో వర్షాలు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పరిస్థితి దారుణంగా ఉన్న సమయంలో కూడా కల్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకుండా ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తోందని ప్రశ్నించారు. పంట పొలాల్లోకి వెళ్లి పరిస్థితిని కళ్లారా పరిశీలిస్తే కరువు తీవ్రత అర్థమవుతుందని అన్నారు. రైతులు పంటల బీమా కోసం తమ వద్ద ఉన్న వస్తువులను తాకట్టు పెట్టి మరీ ప్రీమియం చెల్లించారని, అలాంటి రైతులకు ప్రభుత్వం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. రైతులకు బీమా, నష్టపరిహారం, కరువు సహాయం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**65 శాతానికి పైగా వర్షపాతం లోటు ఉంటే కరువు లేదంటారా**

వ్యవసాయ అధికారులతో తాను మాట్లాడినప్పుడు, కల్లూరు మండలంలో వర్షపాతం లోటు 65 శాతానికి పైగా నమోదైందని, కరువు మండలంగా ప్రకటించాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపించామని అధికారులు చెప్పారని కాటసాని తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నమోదైన వర్షపాతం లోటును పరిగణనలోకి తీసుకుని కరువు మండలంగా ప్రకటించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించినప్పటికీ, ఇప్పటివరకు నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. అధికారులు తమ పరిధిలో నివేదిక పంపించామని చెబుతున్నారు. మరి ఆ నివేదికపై నిర్ణయం తీసుకోవాల్సింది ఎవరు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కొన్ని గ్రామాలు చూసి మొత్తం మండలంపై నిర్ణయం ఎలా..? కల్లూరు పట్టణానికి సమీపంలోని కొన్ని గ్రామాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని మండలంలో కరువు లేదని నిర్ణయించడం సరికాదన్నారు. ఉల్లిందకొండ, చెట్లమలాపురం, పెద్దటేకూరు, చిన్నటేకూరు, తడకనపల్లి, బస్తిపాడు, కొంగనపాడు తదితర గ్రామాలకు వెళ్లి రైతుల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని సూచించారు. ఆ గ్రామాల్లో పంటలు బాగా పండాయని, రైతులు నష్టపోలేదని నిరూపిస్తే.. కరువు మండలం కోసం మేము చేస్తున్న పోరాటం తప్పని ఒప్పుకుంటాం. కానీ క్షేత్రస్థాయిలో రైతులను అడగకుండా, కార్యాలయాల్లో కూర్చొని లెక్కలు చూసి నిర్ణయాలు తీసుకోవడం సరికాదు అని అన్నారు. నీటి వనరులు ఉన్నా రైతుల పొలాలకు నీరు ఎందుకు ఇవ్వలేకపోతున్నారు?

గతంలో నీటి వనరులను సమర్థంగా వినియోగించి గ్రామాల్లో తాగునీటి అవసరాలతో పాటు పంట పొలాలకు కూడా నీరు అందేలా చర్యలు తీసుకున్నామని కాటసాని గుర్తు చేశారు. బోర్లు, చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీరు నిల్వ ఉండేలా చేసిన ప్రయత్నాల వల్ల గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా, పంటలకు కూడా కొంతమేర నీరు అందే పరిస్థితి ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం నీటి వనరులు ఉన్నప్పటికీ రైతుల పొలాలకు నీరు అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.రైతుల సమస్యను రాజకీయం చేయడం కాదు.. రైతుల కోసం పోరాటం.వైఎస్సార్‌సీపీకి రాజకీయంగా చేయాల్సింది ఏమీ లేక రైతుల సమస్యను రాజకీయంగా వాడుకుంటున్నామని అధికార పార్టీ విమర్శించడం హాస్యాస్పదం. రైతుల పంటలు ఎండిపోతుంటే మానవత్వంతో స్పందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని కాటసాని అన్నారు.కరువు ప్రకటన వల్ల రైతులకు నష్టపరిహారం, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి ప్రభుత్వ సహాయం అందే అవకాశం ఉంటుందని, అందుకే రైతుల ప్రయోజనాల కోసం కల్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.చంద్రబాబు నాయుడుకి వర్షాలు కురిపించేంత శక్తి ఉందని చెబుతున్నారుగా నిజంగానే అంత శక్తి ఉంటే కర్నూలుకు వచ్చి వర్షాలు కురిపించండి. రైతుల పంటలను కాపాడండి. ఆయన వర్షాలు కురిపిస్తే పార్టీ భేదాలు మర్చిపోయి మేమే ముందుగా అభినందిస్తాం" అని కాటసాని అన్నారు. రైతుల కష్టాలు కనిపిస్తున్నా ప్రభుత్వం కళ్లు తెరవకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, కల్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే వరకు రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని కాటసాని రామభూపాల్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండలంలోని అన్ని గ్రామాల రైతులు,కల్లూరు మండల వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# అథ్లెటిక్స్‌లో శివజ్యోష్ణ సత్తా..

### ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం.

### రేస్‌వాక్‌లో ప్రతిభ.. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత.



**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న, ఆదోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థిని కురువ శివజ్యోష్ణ అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటింది. 2026 ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో రేస్‌వాక్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించింది. శివజ్యోష్ణ ప్రదర్శించిన ప్రతిభతో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించే స్థాయికి చేరుకోవడం పట్ల కళాశాల అధ్యాపకులు, బీసీ బాలికల హాస్టల్ వార్డెన్, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటుతూ ఆదోనికి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. శివజ్యోష్ణ సాధించిన విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం సాధించిన కురువ శివజ్యోష్ణకు కళాశాల అధ్యాపకులు, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# రంగాపురం గ్రామ పంచాయతీ లో గుర్తింపు కార్డులను పంపిణీ చేసిన వైసీపీ నాయకులు.



**బేతంచెర్లఅక్టోబర్7(నందిపత్రిక).** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని వైఎస్ఆర్సిపి మండల సీనియర్ వైసిపి నాయకులు బుగ్గన చంద్రారెడ్డి,బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్. చలం రెడ్డి,మండల కన్వీనర్ కుంచా తిరుమలేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బేతంచెర్ల మండల పరిధిలోని ఆర్ఎస్.రంగాపురం,కొమ్మూరు కొట్టాల గ్రామాల మాజీ సర్పంచ్ జగన్మోహన్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ చంద్రుడు, వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రాబోయే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించేలా, ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడు,కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రమాద సమయంలో అండగా ఉండేందుకు 5 లక్షల రూపాయలు బీమా సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలోశ్రీ మద్దులేటి లక్ష్మి నరసింహ స్వామి మాజీ చైర్మన్ సిహెచ్. లక్ష్మిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పుసులూరు మురళీకృష్ణ, కౌన్సిలర్ ఇబ్రహీం, వైసీపీ నాయకులు బుగ్గన కుమార్ రెడ్డి సలీం,వలి భాషా, రియాజ్ మరియు ఆర్ఎస్.రంగాపురం, కొమ్మూరు కొట్టాల గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : సీ డి పి ఓ శంషాద్ బేగం

### 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా అవగాహన సమావేశం



**డోన్ - నంది పత్రిక అక్టోబర్ 7**9వ జాతీయ పోషణ మాసం2026 కార్యక్రమంలో భాగంగా డోన్ పట్టణంలోని అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషక పదార్థాలు, వాటిని ఏ విధంగా తీసుకోవాలి, సమతుల ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.సీడీపీఓ శంషాద్ బేగం, మాట్లాడుతూ గర్భిణీలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషక పదార్థాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదలకు సరైన పోషకాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్ర గౌడ్ పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ లోక్‌నాథ్ రావు, డోన్ మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరంజి, రాముగౌడ్, బాషా, అశోక్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.ఐ సీ డి సీ పరమేశ్వరమ్మ అంగన్వాడీ టీచర్లు ఎస్తేరు, మస్తాన్ బీ, షరీఫా, కవిత, వెంకటలక్ష్మి తదితరులు సమావేశాన్ని నిర్వహించడంలో సహకరించారు. గర్భిణీ స్త్రీలు, అంగన్వాడీ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

# మహానందిలో వైభవంగా రెండో రోజు వరుణ యాగం



**మహానంది అక్టోబర్ 07 (నంది పత్రిక):-** ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది పుణ్యక్షేత్రంలో రెండో రోజు వరుణ యాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ, సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో వేదపండితులు రవిశంకర్ అవధాని బృందం,ఆలయ అర్చకులు పాల్గొని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు,హోమాలు,సహస్రవార వరుణ యాగం,వరుణ మంత్ర జపం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



# బాలికల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యం





### జిల్లా లో ని 214 ప్రభుత్వ పాఠశాలల్లో 42 వేల మంది బాలికలకు 20 రోజుల పాటు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**ఆకివీడు, బ్యూరో చీఫ్ అక్టోబర్,7 నంది పత్రిక** బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునే విధంగా ఆత్మరక్షణ నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బృహత్త కార్యక్రమం చేపట్టిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు లోని జడ్.పి. బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షణ శిక్షణ కార్యక్రమం ను బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ** ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఆత్మ రక్షణ ( సెల్ఫ్ డిఫెన్స్) శిక్షణ అందించటం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని 214 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 42,000 మంది బాలికలకు 20 రోజుల పాటు ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రస్తుత సమాజ పరిస్థితుల దృష్ట్యా బాలికలు విద్యతో పాటు తమ భద్రతకు సంబంధించిన ఆత్మరక్షణ నైపుణ్యాలను కూడా అలవర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. సమాజంలో ఎదురయ్యే వివిధ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనేలా బాలికలను తీర్చిదిద్దడంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఆపద సమయంలో తమను తాము రక్షించుకోవడానికి అవసరమైన ప్రాథమిక పద్ధతులు, అప్రమత్తత, ఆత్మవిశ్వాసం వంటి అంశాలపై శిక్షణ పొందడం ద్వారా బాలికల్లో ధైర్యం మరింత పెరుగుతుందన్నారు. బాలికలు భయపడకుండా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. విద్యతో పాటు స్వీయ రక్షణ నైపుణ్యాలను ప్రతి బాలిక అలవర్చుకోవాలని తెలిపారు. ప్రభుత్వం బాలికల విద్య, భద్రత, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాల స్థాయి నుంచే బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను పెంపొందించేలా కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. జిల్లాలోని 214 పాఠశాలల్లో నిర్వహించనున్న ఈ శిక్షణ ద్వారా సుమారు 42 వేల మంది బాలికలకు ప్రయోజనం కలుగుతుందని, 20 రోజుల పాటు నిపుణులైన శిక్షకుల ఆధ్వర్యంలో బాలికలకు ఆత్మరక్షణకు సంబంధించిన వివిధ పద్ధతులపై శిక్షణ అందించనున్నారు. బాలికలు తమ చుట్టూ ఉన్న పరిస్థితులపై అప్రమత్తంగా ఉండటం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ నిర్ణయం తీసుకోవడం, ప్రమాదం నుంచి బయటపడేందుకు అవసరమైన ప్రాథమిక ఆత్మరక్షణ పద్ధతులను నేర్చుకునేలా శిక్షణ ఉండాలని అన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధతో ఓపికగా ఇటువంటి నైపుణ్య శిక్షణను పొందితే భవిష్యత్తులో తమకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ తెలుసుకొని ప్రదర్శించారు.కార్యక్రమంలో సమగ్ర శిక్ష చైర్మన్ పి. శ్యాంసుందర్, జిల్లా విద్యాశాఖాధికారి ఒ వి ఎస్ అనీల్ కుమార్, జిసిడిఒ జి. ఏజె దీవెనమ్మ, తదితరులు పాల్గొన్నారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు, మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్, ఎమ్మార్వో, ఎండిఓ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# గోకులం షెడ్లు త్వరగా పూర్తిచేయించాలి

### - ఏపీడీ వెంకటరామిరెడ్డి



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలో రైతులు పశువుల కోసం నిర్మించుకొనే గోకులం షెడ్లు త్వరగా పూర్తి చేయించాలని ఏపీడీ వెంకటరామిరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని వీబీజీ రాంజీ కార్యాలయం నందు క్షేత్ర సహాయకులకు ఎంపీడీఓ మేరి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో నిర్మించుకుంటున్న పశువుల షెడ్లను త్వరితగతిన పూర్తిచేయించాలన్నారు. అదేవిధంగా క్యాటిల్ షెడ్లు ఎంత త్వరగా నిర్మాణం పూర్తి చేసుకుంటే ఒకేసారే బిల్లు మంజూరు అవుతుందన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలలో పనులకు వస్తున్న శ్రామికులకు కొలతల ప్రకారం పనులు చేస్తేనే వేతనం రూ.300 వర్తిస్తుందని వారికి అవగాహన కల్పించి కొలతల ప్రకారం పనులు చేయించాలని సూచించారు. క్షేత్ర సహాయకులు గ్రామాలలో అక్షరాంధ్ర వలంటీర్లు ప్రతిరోజు చదువు రాని వారికి అక్షరాలు నేర్పాలని, వారు చదువు నేర్చుకున్నట్లు ప్రతిరోజు హాజరు తీసుకొని యాప్లో లో అప్లోడు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# అక్టోబరు 9న నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలో నరసాపురం నియోజకవర్గ స్థాయి ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 7 నంది పత్రిక** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా నరసాపురం నియోజకవర్గంలో 3వ ప్రత్యేక పి జీ ఆర్ ఎస్ కార్యక్రమాన్ని అక్టోబరు 9వ తేదీ (శుక్రవారం ) నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మున్సిపల్, మండల స్థాయి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. నరసాపురం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# పారిశ్రామిక ప్రోత్సాహకాలు అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 7 నంది పత్రిక** జిల్లాలో సహజ వనరులు, వ్యవసాయం, ఆక్వా కల్చర్, ఉద్యానవన రంగం, తీరప్రాంత పర్యాటకం, స్థానిక పారిశ్రామిక ప్రోత్సాహకాలు అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర - 2047 విజన్లో భాగంగా అమరావతి ఆర్థిక ప్రాంత ప్రణాళిక తయారీ పై అమరావతి నుంచి వచ్చిన ఎల్.ఇ.ఎ. అసోసియేట్స్ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణ, సలహా సంస్థ బృందం తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో బుధవారం వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమావేశం నిర్వహించారు.ఎల్.ఇ.ఎ. అసోసియేట్స్ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణ, సలహా బృందం జిల్లాలో ఆర్థిక వృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాధాన్యతా రంగాలపై జిల్లా కలెక్టర్ తో సమగ్రంగా చర్చించారు. అమరావతి ఆర్థిక ప్రాంత ప్రణాళిక తయారీ లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధి అవకాశాలు, వివిధ రంగాల ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అందుబాటులో ఉన్న సహజ వనరులు, వ్యవసాయం, ఆక్వా కల్చర్, ఉద్యానవన రంగం, తీరప్రాంత పర్యాటకం, స్థానిక పారిశ్రామిక ప్రోత్సాహకాలు అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని బృందానికి వివరించారు. జిల్లాలో 2.30 లక్షల ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నామన్నారు. ఆక్వా 1.30 లక్షల ఎకరాలలో సాగు చేయటం జరుగుతుందన్నారు. జిల్లాలో 21,300 హెక్టార్లలో ఉద్యానవన పంటను సాగు చేయటం జరుగుతుందన్నారు. చేపలు, రొయ్యల ప్రాసెసింగ్ సమయంలో వచ్చే వ్యర్థాలను కేవలం పశువుల మేతగా మాత్రమే కాకుండా వాటి ద్వారా కొల్లాజెన్ వంటి ఎక్కువ ధర పలికే ఉత్పత్తులను తయారు చేయవచ్చు అని అన్నారు. ఆక్వా, హార్టికల్చర్, ఫిషరీస్ రంగాలు అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని అన్నారు. వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తులు అయిన బియ్యం బిల్లింగ్ రంగానికి సంబంధించి ప్యాడీ బై ప్రోడక్ట్ ను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని అన్నారు. రైతులు తమ మిల్లుల వద్ద ఉన్న స్థలాలను ఇతర ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధికి వినియోగిస్తే మెరుగ్గా ఉంటుందన్నారు. జిల్లాలో ఆక్వా కల్చర్ విస్తరణకు అధిక అవకాశాలు ఉన్నాయని అన్నారు. జిల్లాలో కొబ్బరి సాగు విస్తారంగా ఉన్నందున కొబ్బరి పీచు, ఫైబర్స్, సెల్ ఆధారిత ప్రోడక్ట్, వయోచార్ తయారీ యూనిట్లకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. పొదుపు సంఘాల మహిళలను ఈ రంగానికి ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. గోదావరి నది సుదీర్ఘ పరివాహక ప్రాంతం, బీచులు ఉన్నందున అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చు అన్నారు. వాటర్ స్పోర్ట్స్, రిసార్ట్స్, టూరిజం ప్రాజెక్టుల పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించవచ్చు అన్నారు. పాడిరంగం సంబంధించి పసుగ్రాసం ఉత్పత్తి, డెయిరీ ఫార్మింగ్, గొర్రెలు, మేకల పెంపకం వంటి అనుబంధ రంగాలను అభివృద్ధికి అవకాశం ఉందని అన్నారు. చిన్న మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పే వారికి తోడ్పాటు అందించడానికి ప్రతి సోమవారం ఇండస్ట్రియల్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసి నూతన పారిశ్రామికవేత్తలకు మార్గదర్శకం, దిశానిదేశాలు అందించి మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రోడ్డు, రైలు మార్గాల సౌకర్యాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ప్రతినిత్యం ఎగుమతులు భారీ ఎత్తున నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎల్.ఇ.ఎ. అసోసియేట్స్ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహణ, సలహా సంస్థ సభ్యులు డాక్టర్ ఏ పన్నీర్ సెల్వం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ అభియాన్, రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణాంధ్ర -2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాల కోసం రూపొందించిన దిశానిర్దేశక ప్రణాళిక (స్ట్రాటజిక్ ఫ్రేమ్‌వర్క్) లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం, కృష్ణ, బాపట్ల, పల్నాడు, మార్కాపురం జిల్లాలలో పర్యటించి స్టడీ నివేదికను తయారు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా కల్చర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలి

**ఆక్వా ల్యాబ్‌ల ద్వారా రైతులకు విస్తృతంగా పరీక్షలు నిర్వహించాలి**

**ఎన్ఎఫ్‌డీపీ రిజిస్ట్రేషన్‌తో బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలి**

**ఎంపెడా పరిధిలోని ఆక్వా చెరువుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 7 నంది పత్రిక** జిల్లాలో ఆక్వా రైతులకు ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సేవలు, బీమా సదుపాయాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మత్స్యశాఖ అధికారులతో ఆక్వా కల్చర్ విస్తరణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఆక్వా ల్యాబ్ సేవలు, ఎన్ ఎఫ్ డీపీ రిజిస్ట్రేషన్, ఎంపెడా పరిధిలోని చెరువుల నమోదు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె మండలాల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హత కలిగిన ఆక్వా రైతులు, ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఒక నెల గడువులోగా పూర్తి చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు రిజిస్ట్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పించాలన్నారు.ఆక్వా రంగంలో రైతులు నష్టాలను నివారించేందుకు ఆక్వా ల్యాబ్‌ల సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. రైతులు నీటి నాణ్యత, మట్టి నాణ్యత తదితర అంశాలకు సంబంధించి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని, ల్యాబ్‌ల ద్వారా రైతులకు అధిక సంఖ్యలో పరీక్షలు నిర్వహించి అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ఎన్ ఎఫ్ డి పి రిజిస్ట్రేషన్ ప్రాధాన్యతను రైతులకు వివరించాలని అన్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులకు వర్తించే బీమా పథకాలపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి రైతు బీమా సదుపాయాన్ని వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.అలాగే ఎంపెడా పరిధిలోని ఆక్వా చెరువుల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నమోదు కాని చెరువులను గుర్తించి, సంబంధిత రైతులకు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి డాక్టర్ బి శ్రీనివాస్, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రచారానికి రవాణా రంగం అండ




### కృష్ణా జిల్లా, ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్లకు ఎంపీ కేశినేని చిన్ని అభినందనలు

**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 7 నంది పత్రిక** విజయవాడ ఉత్సవ్ 2.0ను మరింత విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్లు చేస్తున్న ప్రచార కార్యక్రమాలను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి కార్యాలయం వేదికగా జరిగిన సమావేశము లో అభినందించారు.విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రచారంలో భాగంగా ప్రతి రవాణా వాహనంపై ఉత్సవ్ ప్రచార స్టిక్కర్లను ప్రదర్శిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు లారీ యజమానులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీ చిన్ని పేర్కొన్నారు. రవాణా వాహనాలు నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నిరంతరం ప్రయాణిస్తుండటంతో, వాటిపై ఉత్సవ్ ప్రచార స్టిక్కర్లు ఏర్పాటు చేయడం ద్వారా విజయవాడ ఉత్సవ్ సందేశం మరింత విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని స్వయంగా ఆర్టీసీ బస్సుపై విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రచార స్టిక్కర్‌ను అంటించారు. విజయవాడ ఉత్సవ్‌ను ప్రజలందరి పండుగగా తీర్చిదిద్దేందుకు వివిధ వర్గాలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు."విజయవాడ ఉత్సవ్ 2.0ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లడంలో రవాణా రంగం భాగస్వామ్యం ఎంతో కీలకం. ప్రతి వాహనంపై ఉత్సవ్ ప్రచార స్టిక్కర్‌ను ప్రదర్శిస్తూ వారు చేస్తున్న ప్రచారం ద్వారా విజయవాడ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవం, ఉత్సవాల సందేశం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లోకి వెళుతుంది. ఈ కృషి చేస్తున్న కృష్ణా జిల్లా, ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్లకు ప్రత్యేకంగా అభినందనలు" అని ఎంపీ చిన్ని తెలిపారు.విజయవాడ ఉత్సవ్ 2.0ను విజయవంతం చేయడంలో వ్యాపార, రవాణా, పారిశ్రామిక, విద్యా, సాంస్కృతిక రంగాలతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో విజయవాడ ఉత్సవ్ 2.0ను రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవంగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బొప్పన భవ కుమార్, ఈశ్వరరావు, రాజా, రావి గోపాలరావు, పొట్లూరి సాయిబాబు, కొల్లి మురళి,యార్లగడ్డ సుందర్ రావు, కోనేరు కిషోర్ తదితరులు పాల్గొన్నారు





# చెత్తను వృథాగా పడవేయవద్దు

### -చెత్త ఇవ్వండీ నిత్యవసర సరుకులు పొందండి

### - ఎంపీడీఓ మేరీ

**కొత్తపల్లి - నంది పత్రిక :** గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఇళ్లలో సేకరించిన చెత్తను వృథాగా పడవేయవద్దు అని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం మండల పరిధిలోని భ్రమరాంభ చెంచుగూడెం నందు స్వచ్ఛరథం వద్ద సరుకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఇళ్లలోని తడి, పొడి చెత్తను వృథాగా పారవేస్తుంటారన్నారు. అలా చేయకుండా చెత్త, వ్యర్థాలనును సేకరించుకొని గ్రామాలలోకి స్వచ్ఛరథం వాహనం వచ్చినప్పుడు వారి ఆ చెత్త, వ్యర్థాల (గాజు సీసాలు, ప్లాస్టిక్ సీసాలు, పాత పేపర్లు, ప్యాకెట్లు, కవర్లు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు)ను ఇచ్చి సమానమైనా 20 రకాల నిత్యవసర సరుకులను పొందవచ్చునన్నారు. గ్రామాలు స్వచ్ఛంగా ఉండేందుకు ఈ ప్రక్రియకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. చెత్తను ఏలా సేకరించాలని, ఏలా వేరు చేసుకోవాలి, పరిసరాలను ఏలా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న విషయాలను గిరిజనులకు వివరించి అవగాహన కల్పించారు.



# అంగన్వాడీల బలోపేతం తో భావిభారతవానికి నాంది







## అంగన్వాడీలపై సామాజిక భాగస్వామ్యం పెంపొందాలి

## అంగన్వాడీలు విద్య, ఆరోగ్య, పోషణాలయ కేంద్రాలు

## 9వ జాతీయ పోషణ మాసోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

## రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 7 నంది పత్రిక** అంగన్వాడీలు అంటే భావి భారత పౌరుల తయారీకి నిలయాలు అని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంప చోడవరం ఆదివాసీ వర్తక కేంద్రం సమీపంలో ఐసిడిఎస్ పథక సంచాలకులు ఉమా అధ్యక్షతన బుధవారం 9వ జాతీయ పోషణామాసోత్స వంలో భాగంగా మన అంగన్వాడీ -మన పోషణ పాఠశాల కార్యక్రమాన్ని ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు ఐసిడిఎస్ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల బలోపేతంలో

**సామాజిక భాగస్వామ్యం పెంపొందాలన్నారు.**

**మన అంగన్వాడీ - మన బాధ్యత**

అనే నినాదంతో ప్రత్యేకశ్రద్ధతో ప్రజలు వ్యవహరించాలన్నారు. ఇలాంటి ప్రత్యేక దినోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో భాగంగా నిర్వహణ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అంగన్వాడీలు కేవలం ఒక చిన్నారులకే కాకుండా గర్భిణులు, బాలింతలు మరియు పిల్లల్లో పోషకాహార లోపాన్ని నిర్మూ లించడంలో కీలకంగా వ్యవ హరిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది ఇక్కడే ఏర్పడుతుందన్నారు. 3నుండి 6 సంవత్సరాల లోపు చిన్నారుల్లో ఉన్న మేధో వికాసం, భాషా నైపుణ్యాలు మరియు సృజనాత్మకతను పెంపొం దించడంలో వీటి పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. అంగన్వాడీ కేంద్రాలను కేవలం ఆహార పంపిణీ కేంద్రాలుగా కాకుండా, విద్య, ఆరోగ్యం అందించే పోషకాహార కేంద్రాలని ఆమె స్పష్టం చేశారు. చిన్నారుల సామర్థ్యాలను బట్టి ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించే కేంద్రాలన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ప్రొటీన్లు, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆకుకూరలు, పప్పులు, మరియు స్థానికంగా దొరికే పండ్ల ప్రాధాన్యతను వివరించడం వీరి బాధ్యత అన్నారు.అంగన్వాడీ కేంద్రాల బలోపేతం దిశగా పౌరులు సామాజిక బాధ్యతగా ఉండాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ కేవలం ప్రభుత్వాలదే కాదన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అనే భావనను పౌరులకు కల్పించడంలో ఐసిడిఎస్ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కేంద్రాల నిర్వాహకులు ఆయా కేంద్రాల పరిధిలో చేపట్టా ల్సిన విధులు విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.చిన్న పిల్లల శారీరక మానసిక ఎదుగుదల పై దృష్టి సారించాలని కోరారు. రక్తహీనత (ఎనీమియా) నివారణ మరియు వ్యక్తిగత పరిశు భ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంపై చైతన్యం చేస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టాలన్నారు.

**నూతనంగా ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించిన ఎమ్మెల్యే**

పోలవరం జిల్లా వ్యాప్తంగా 170మందికి నియామక పత్రాలు అంద జేత సమీకృత స్త్రీ శిశు సంక్షేమా భివృద్ధి శాఖలో నూతనంగా ఉద్యోగాలు పొందిన వారు అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. రంప చోడవరం లో ఐసిడిఎస్ పథక సంచాలకులు ఉమా అధ్యక్షతన బుధవారం నూతనంగా అంగన్వాడీ కార్యకర్త, సహాయకులుగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఐ సి డి ఎస్ లో ఉద్యోగం పొందటం మంచిదన్నారు. మీరు గ్రామాల్లోనే ఉంటూ సేవలందించే అవకాశం ఉంటుందన్నారు. ఏ ఉద్యోగం అయినా క్రమ శిక్షణ కలిగి అంకితభావంతో పనిచేస్తే మంచి గుర్తింపు వస్తుందన్నారు. కేవలం గుర్తింపు కాకుండా మన బాధ్యతలకు మనమిచ్చే గౌరవం ఏదైనా ఉందంటే అది కేవలం మన విధులను మనం మంచిగా చేయడమే అన్నారు. అలాగే రంప చోడవరం డివిజన్లో నూతనంగా ఎన్నికైన 1 అంగన్వాడీ కార్యకర్త, 91 అంగన్వాడీ సహాయకులకు మరియు చింతూరు డివిజన్లో ఇద్దరు అంగన్వాడీ కార్యకర్తలకు, 76 మంది అంగన్వాడీ సహాయకులకు ఆమె చేతులు మీదుగా నియామక పత్రాలు అందించారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరే వారు మంచిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ సభ్యులు షేక్ సుభానీ, మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, సీతపల్లి దేవస్థానం గడి బాపనమ్మ తల్లి ధార్మిక మండలి సభ్యులు సిద్దా వెంకన్న దొర, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, నియోజక వర్గ ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా బాపన్న దొర అనే బాబీ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి, పతివాడ రమణ, సి డి ఎస్ పి డి సిడిపిఓ కుమారి, పర్యవేక్షకులు అధిక సంఖ్యలో కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# విదేశీయుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి....

## నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు



**విజయవాడ బ్యూరో చీఫ్ అక్టోబర్ 7 నంది పత్రిక** ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్ పరిధిలో విదేశీయులకు ఆశ్రయం లేదా వసతి కల్పించే హోటళ్లు, అతిథి గృహాలు, ఇళ్లు అద్దెకిచ్చే యజమానులు, ఆసుపత్రులు, హాస్టళ్లు, ఆశ్రమాలు, సత్రాలు మరియు విద్యా సంస్థల యజమానులు/యాజమాన్యాలు తప్పనిసరిగా వారి వద్ద ఆశ్రయం పొందే విదేశీయుల రాక, బస మరియు బయలుదేరే వివరాలను నిర్దేశిత విధానంలో ఆన్లైన్ డిజిటైలేజను ద్వారా 24 గంటల్లోగా ఎఫ్.ఆర్.ఆర్.ఓ.లో తప్పనిసరిగా నమోదు చేసి (ఫారనర్స్ రీజనల్ రిజిస్ట్రేషను ఆఫీసరు)/ఎఫ్.ఆర్.ఓ. (ఫారనర్స్ రిజిస్ట్రేషను ఆఫీసరు) పోలీసు అధికారులకు తెలియజేయాలని నగర పోలీస్ కమీషనర్ తెలిపారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ...... వివిధ దేశాల నుంచి జిల్లాకు వివిధ పనులు, విద్య, వైద్యం, పర్యటన, ఇతర అవసరాల నిమిత్తం వచ్చే విదేశీయులు, పాస్‌పోర్టు, వీసా, వ్యక్తిగత వివరాలు, వసతి వివరాలు, వచ్చిన తేదీ తదితర నిర్దేశిత వివరాలను 'ది ఇమ్మిగ్రేషన్ అండ్ ఫార్ నర్స్ చట్టం - 2025, సెక్షన్ 8 ప్రకారం తప్పనిసరిగా ష్ట్రజూం://అఅఎఖుఅటతీతీశీ.స్ర్తశీజ.అఅ వెబ్ సైట్ ద్వారా నమోదుచేసి 24గంటలలోగా ఎఫ్.ఆర్.ఆర్.ఓ/ఎఫ్.ఆర్.ఓ. కార్యాలయాలకు సకాలంలో అందించాల్సిన బాధ్యత వారికి వసతి, ఆశ్రయం కల్పించే సంస్థలపై ఉందని నగర పోలీస్ కమీషనర్ తెలిపారు. సంబంధిత ఆన్లైన్ వ్యవస్థలో నమోదు చేయడంలో సంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయరాదని, విదేశీయుల వివరాలను నిర్దేశిత ఖీశీతీఎ ×××/ఖీశీతీఎ 'జ' పోర్టల్ ద్వారా నమోదు చేయకుండా నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యవహరించినట్లయితే యాజమాన్యాలపై 'ది ఇమ్మిగ్రేషన్ అండ్ ఫార్నర్స్ చట్టం - 2025, సెక్షన్ 23(బి) ప్రకారం రూ.50 వేలు నుండి రూ. 1లక్ష వరకు జరిమానా లేదా 2 సం.లు నుండి 7 సం.లు వరకు జైలు లేదా రెండూ విధించే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల హోటల్ యాజమాన్యాలు, గెస్ట్‌హౌస్‌లు, వ్యక్తిగత గృహ యజమానులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు మరియు ఇతర సంబంధిత సంస్థలు విదేశీయులకు వసతి లేదా సేవలు కల్పించే సమయంలో చట్టపరమైన విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్ కు విచ్చేసే విదేశీయులు భారతదేశ చట్టాలను తప్పనిసరిగా గౌరవించాలని, చెల్లుబాటులో ఉన్న వీసా, పాస్పోర్టు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. విదేశాల్లో స్థిరపడిన ఓ.సి.ఐ. (ఓవరిసిస్ సిటిజన్ ఆఫ్ ఇండియా) భారతీయులు, దేశంలో నిర్వహించే ఎటువంటి ఎన్నికల్లో పోటీ చేయరాదని, ఓటు వేయరాదని, వ్యవసాయ భూములను కొనుగోలు చేయరాదని నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలిపినారు.

# అత్యధిక కేసులు పరిష్కరించినందుకు సన్మానం



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** జాతీయ లోక్ అదాలత్ లో అత్యధిక కేసులు పరిష్కరించినందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని జడ్జిలు, న్యాయవాదులను బుధవారం సన్మానించారు. కర్నూలు జిల్లా న్యాయ సేవ సదన్ నందు పి. వాసు, ఆరవ అదనపు జిల్లా జడ్జి ఫుల్ అడిషనల్ చార్జ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు చైర్మన్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మరియు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సెప్టెంబర్ 12 న జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో కర్నూలు, నంద్యాల జిల్లాలలో 66,000కు పైగా కేసులు పరిష్కారమై కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే మూడవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషిచేసిన జడ్జిలు , న్యాయవాదులకు, పోలీసులకు మరియు ఎక్సైజ్ అధికారులకు జిల్లా జడ్జి గారి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ ఇలాగే అందరు తమ సహాయ సహకారాలు అందించి వచ్చే లోక్ అదాలత్ లు కూడా విజయవంతం చేయాలని కోరారు. ఇందులో ఎక్కువ సివిల్ మరియు క్రిమినల్ కేసులు చేసిన జడ్జీలైన అనూష, స్పెషల్ మొబైల్ జడ్జి కర్నూలు మరియు టి. భాస్కర్, ఆళ్లగడ్డ మేజిస్ట్రేట్, యస్.జ్యోతి, డోన్ మేజిస్ట్రేట్, కే.హేమ, ఆలూరు మేజిస్ట్రేట్ మరియు వెంకట్రామిరెడ్డి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆదోని, నూరుల్లా, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ లకు అవార్డులను పంపిణీ చేశారు. అలాగే ఎక్కువ క్రిమినల్ కేసులు పరిష్కరించడంలో కృషి చేసిన పోలీసు అధికారులైన కర్నూలు డిఎస్పి వీరరాఘవేంద్ర, కర్నూల్ టౌన్, డోన్ డిఎస్పి శ్రీనివాసులను అవార్డులతో సన్మానించారు. మోటార్ యాక్సిడెంట్ కేసులు ఎక్కువగా చేసిన న్యాయవాది రామాంజనేయులును కూడా సన్మానించారు. ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషిచేసిన ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాల సిఐలు మరియు ఎస్ఐలు మరియు ఎక్సైజ్ పోలీసులు, కోర్టు కానిస్టేబుళ్లను కూడా అవార్డులతో సన్మానించారు. కర్నూలు కోర్టు మానిటరింగ్ మరియు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ రామయ్య నాయుడుని కూడా అవార్డుతో సన్మానించారు. ఈ సమావేశంలో పోక్సో కోర్టు అదనపు జిల్లా జడ్జి రాజేంద్ర బాబు, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, జూనియర్స్ జడ్జి లు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్లు, బార్ ప్రెసిడెంట్ చంద్రుడు, కర్నూలు అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ హుస్సేన్ పీరా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ సుధీర్ బాబు,పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో మూడవ స్థానం





## కేసుల పరిష్కారం కోసం కృషి చేసిన జడ్జిలకు, న్యాయవాదులకు, పోలీసులకు సన్మానం

## జిల్లా ప్రధాన న్యాయ మూర్తి వాసు,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు జిల్లా న్యాయ సేవ సదన్ నందు పి. వాసు, ఆరవ అదనపు జిల్లా జడ్జి ఫుల్ అడిషనల్ ఛార్జ్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మరియు చైర్మన్,జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మరియు కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12-09-2026 న జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాలలో 66000 పైగా కేసులు పరిష్కారం అయి కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే మూడవ స్థానాన్ని సంపాదించిన సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం 07-10-2026 న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయంలో ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషిచేసిన జడ్జిలకు, న్యాయవాదులకు, పోలీసులకు మరియు ఎక్సైజ్ అధికారులకు జిల్లా జడ్జి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేయడం జరిగింది. జిల్లా జడ్జి మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్ విజయవంతం అవ్వడంలో కృషి చేసిన అందర్నీ అభినందిస్తున్నామని తెలిపారు. ఇలాగే అందరు తమ సహాయ సహకారాలు అందించి వచ్చే లోక్ అదాలత్ లు కూడా విజయవంతం చేయాలని కోరారు.ఇందులో ఎక్కువ సివిల్ మరియు క్రిమినల్ కేసులు చేసిన జడ్జీలైన అనూష, స్పెషల్ మొబైల్ జడ్జి కర్నూలు మరియు టి. భాస్కర్, ఆళ్లగడ్డ మేజిస్ట్రేట్, యస్.జ్యోతి, డోన్ మేజిస్ట్రేట్, కే.హేమ, ఆలూరు మేజిస్ట్రేట్ మరియు వెంకట్రామిరెడ్డి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆదోని, నూరుల్లా, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ లకు అవార్డులను పంపిణీ చేశారు. అలాగే ఎక్కువ క్రిమినల్ కేసులు పరిష్కరించడం లో కృషి చేసిన పోలీసు అధికారులైన వీర రాఘవేంద్ర,కర్నూల్ టౌన్ డిఎస్పి మరియు శ్రీనివాసులు, డోన్ డిఎస్పీలను అవార్డులతో సన్మానించారు. మోటార్ యాక్సిడెంట్ కేసులు ఎక్కువగా చేసిన రామాంజనేయులు న్యాయవాది ని కూడా అవార్డులతో సన్మానించారు. ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషిచేసిన ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాల సిఐలు మరియు ఎస్ఐలు మరియు ఎక్సైజ్ పోలీసులు,కోర్టు కానిస్టేబుల్లను కూడా అవార్డులతో సన్మానించారు. కర్నూలు కోర్టు మానిటరింగ్ మరియు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ రామయ్య నాయుడుని కూడా అవార్డుతో సన్మానించారు. ఈ సమావేశంలో పోక్సో కోర్టు అదనపు జిల్లా జడ్జి రాజేంద్ర బాబు, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, జూనియర్స్ జడ్జి లు మరియు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్లు, బార్ ప్రెసిడెంట్ చంద్రుడు, కర్నూలు అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ హుస్సేన్ పీరా , ఎక్సైజ్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ సుధీర్ బాబు,పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.





# బెంగళూరులో పేలిన ట్రాన్స్‌ఫార్మర్!

## అమెజాన్ ఆఫీస్ సమీపంలో పేలుడు

బెంగళూరులో ఉదయం తీవ్ర కలకలం రేగింది. అమెజాన్ కార్యాలయం సమీపంలో ఉన్న ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలిపోయింది. ఈ ప్రమాదంలో ఫుట్‌పాత్‌పై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి గాయపడగా, స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. బాగలూరు క్రాస్ వద్ద ఉదయం 9:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మహమ్మద్ అఫ్రోజ్ అనే వ్యక్తి ఫుట్‌పాత్‌పై నడుస్తుండగా, సమీపంలోని విద్యుత్ రింగ్ మెయిన్ యూనిట్ (ఆర్ఎంయూ) భారీ శబ్దంతో పేలింది. ఈ ధాటికి అఫ్రోజ్ కిందపడిపోగా, వెంటనే స్పందించిన స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు క్షేమంగా ఉన్నాడని, ప్రాణాపాయం తప్పిందని అధికారులు వెల్లడించారు. ఈ ఘటన యలహంక ఓల్డ్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ప్రమాదంపై బెంగళూరు విద్యుత్ సరఫరా కంపెనీ (బెస్కాం) అధికారులు స్పందించారు. మీడియం-వోల్టేజ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లోని భాగమైన రింగ్ మెయిన్ యూనిట్‌లో సాంకేతిక లోపం తలెత్తిందని, ఇలాంటి పేలుళ్లు చాలా అరుదుగా సంభవిస్తాయని తెలిపారు. తమ సాంకేతిక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలో కొంతసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

# యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అజయ్ రాయ్ స్థానంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన ఆరాధన మిశ్రా మోనాను అధిష్ఠానం నియమించింది. రాష్ట్రంలో చేజారిన బ్రాహ్మణ ఓటు బ్యాంకును తిరిగి దక్కించుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, దశాబ్దం క్రితం విఫలమైన పాత వ్యూహాన్నే కాంగ్రెస్ పునరావృతం చేస్తోందన్న విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ ఇటువంటి వ్యూహాన్నే అనుసరించింది. అప్పటి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచన మేరకు, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దింపింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 10 నుంచి 12 శాతం ఉన్న బ్రాహ్మణ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే పార్టీకి పూర్వవైభవం లభిస్తుందని అప్పట్లో అంచనా వేసింది. అయితే, ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, తీవ్రంగా బెడిసికొట్టడంతో కాంగ్రెస్ కేవలం ఏడు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం మరోసారి అదే బాటలో పయనిస్తున్న కాంగ్రెస్‌కు, ఈసారి మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచే సవాళ్లు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తన 'పీడీఏ' (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్) నినాదాన్ని మరింత విస్తృతం చేశారు. పీడీఏలోని 'పి' అంటే 'పండిట్' (బ్రాహ్మణులు) అని కూడా అర్థం చెబుతూ ఆ సామాజికవర్గ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం బ్రాహ్మణులను విస్మరిస్తోందని ఆయన నిరంతరం విమర్శలు గుప్పిస్తున్నారు.

# అనుభవమే గొప్ప ఆస్తి

సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు. సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ, “దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది” అని అన్నారు. తన చిన్నతనం రోజులను గుర్తుచేసుకుంటూ, గుజరాత్‌లోని వద్నగర్‌ను ప్రస్తావించారు ప్రధాని మోదీ. తాను ఎప్పుడూ పాఠశాలకు అందరికంటే ముందుగా వచ్చే విద్యార్థులలో ఒకడినని తెలిపారు. నేర్చుకోవాలనే తపన తన జీవితంలో ఒక భాగమని, నేటికీ తాను ఎప్పుడూ ఒక విద్యార్థిగానే భావిస్తానని పేర్కొన్నారు. తన చదువు, నేర్చుకునే తపన ఎన్నటికీ తగ్గకూడదని దేవుడిని ప్రార్థించినట్లు వెల్లడించారు. జీవితంలో ఎదురైన కష్టాల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చెబుతూ, “నన్ను కించపరిచిన వారు నాకు కోసం తిరిగి నిలబడటం నేర్పించారు. నన్ను వ్యతిరేకించిన వారు ప్రజాస్వామ్య శక్తిని నేర్పించారు. ప్రతి సంక్షోభం నా సహనానికి ఒక పరీక్షగా నిలిచింది” అని అన్నారు. బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన ‘కర్మణ్యే వాధికారస్తే’ మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్టల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. “దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను” అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, “నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను” అన్నారు. మరోవైపు 25 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు ప్రభుత్వ అధినేతగా పనిచేసిన ప్రధాని మోదీ నాయకత్వాన్ని కేంద్ర కేబినెట్ మంగళవారం ప్రశంసించింది. తొలుత గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత భారత ప్రధానమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడింది. ‘దేశమే ప్రథమం, పౌరుడే తొలి ప్రాధాన్యం’ అనే సూత్రంతో ముందుకు వెళున్నారని పేర్కొంది. విశేష జనాదరణ పొందుతూ మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ వరుసగా విజయాలు సాధించారని గుర్తు చేస్తూ, ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా మూడుసార్లు సేవలందించిన సమయంలో మోదీ పలు విజయవంతమైన కార్యక్రమాలను చేపట్టారని కేబినెట్ పేర్కొంది. గుజరాత్‌లో అమలు చేసిన పథకాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దార్శనికతతో ముందుకు సాగుతున్నారని తెలిపింది. చిన్నతనంలో తన తల్లి ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితులను, దేశంలో పేదరికాన్ని స్వయంగా చూసిన అనుభవం మోదీ విధానాలపై ప్రభావం చూపిందని పేర్కొంది. ఆ అనుభవాలతో ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారని తెలిపింది. మహిళలు, రైతులు, యువతకు అవకాశాలను విస్తరించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని కేబినెట్ పేర్కొంది. దేశ అభివృద్ధికి అవసరమైన సంస్కరణలను ధైర్యంగా చేపడుతున్నారని తెలిపింది. మోదీ నాయకత్వంలో మూలధన వ్యయం రూ.12 లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించింది. హైవేల విస్తరణ, రైల్వేల ఆధునికీకరణ వేగంగా జరుగుతున్నాయని పేర్కొంది. అలాగే మోదీ పాలనలో డిజిటల్ సేవల్లోనూ విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని కేబినెట్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ తన నాయకత్వ సామర్థ్యంతో దేశాన్ని సరైన దిశలో ముందుకు తీసుకెళున్నారని పేర్కొంది. అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ప్రాధాన్యం మరింత పెరుగుతోందని తెలిపింది. దేశ భద్రత విషయంలోనూ ప్రధాని మోదీ రాజీపడని వైఖరిని అవలంబిస్తున్నారని కేబినెట్ తీర్మానంలో పేర్కొంది. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలు ఇందుకు నిదర్శనమని తెలిపింది. 2047 నాటికి సుసంపన్న, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు మద్దతుగా నిలుస్తూ తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు కేబినెట్ వెల్లడించింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రవాణా రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణలో ఈ సంస్థ కీలకంగా వ్యవహరించనుందని కేంద్ర ఐటీ, సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వివిధ మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయ లోపాలను తగ్గించి మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచేలా ఇట్లా పనిచేస్తుందని ఆయన వివరించారు.

రూ.500 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సాంకేతిక అర్హతలను ఇట్లా మదింపు చేస్తుందని తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసే ప్రతిపాదనకూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ గ్రోత్ ఫండ్ ద్వారా ఎంఎస్ ఎంఈ లకు దీర్ఘకాలంలో అవసరమైన పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దీంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. మొత్తంగా ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపిస్తూ కేబినెట్ తీర్మానం చేయడంతో పాటు రవాణా మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ రంగంలో సమన్వయం, ఎంఎస్ ఎంఈలకు పెట్టుబడుల లభ్యతను పెంచే కీలక నిర్ణయాలను సమావేశంలో తీసుకుంది.

# పరిశ్రమల బలం పెంచిన పాతికేళ్ల పాలన

సాహసోపేత నిర్ణయాలు తీసుకుని పెట్టుబడులు పెట్టాలన్నా, దీర్ఘకాలం కొనసాగాలన్నా పరిశ్రమలకు విశ్వాసంతో కూడిన వాతావరణం అవసరం. మొదట గుజరాత్‌లోను, తర్వాత దేశవ్యాప్తంగానూ మొత్తం తన పాతికేళ్ల పాలనలో నరేంద్ర మోదీ అలాంటి వాతావరణాన్ని సృష్టించారు. 2003లో ప్రారంభమైన వైబ్రెంట్ గుజరాత్ సదస్సు ఆయన వ్యాపార విధానానికి తొలి నిదర్శనం. పరిశ్రమలను ప్రోత్సహించడానికి, వ్యాపార సంస్థల సమస్యలను తెలుసుకోవడానికి, వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి ఇది ఒక వేదికగా మారింది. రాష్ట్ర స్థాయిలో పెట్టుబడుల సదస్సులు పెట్టాలన్న ఈ ఆలోచనను ఆ తర్వాత దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాయి. అలా ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే మోదీ ప్రభావం గుజరాత్ సరిహద్దులు దాటింది. కర్మాగారాలను ఏర్పాటు చేస్తూ పోవడమే గుజరాత్ విధానం కాదు. అంతకంటే ముఖ్యంగా సమగ్ర పారిశ్రామిక వ్యవస్థలను నిర్మించడంపై గుజరాత్ విధానం దృష్టి పెట్టింది. ఓడరేవులు, రహదారులు, విద్యుత్ వ్యవస్థలు, పారిశ్రామిక వాడలు, క్లస్టర్లను సమన్వయంతో అభివృద్ధి చేశారు. మౌలిక సదుపాయాలు, వ్యాపార విధానాలు పరస్పర సమన్వయంతో ఒకే దిశగా సాగినప్పుడు తయారీ రంగం వేగంగా స్పందిస్తుందనేది గుజరాత్ నేర్పిన ప్రధాన పాఠం. మోదీ 2014లో గాంధీనగర్ నుంచి న్యూఢిల్లీకి వెళ్లినప్పుడు పరిశ్రమలు, తయారీ రంగంపై తనకున్న అవగాహనను దేశవ్యాప్తంగా అమలు చేసే అవకాశం ఆయనకు లభించింది. మోదీ తెచ్చిన పలు సంస్కరణలు పారిశ్రామిక వాతావరణాన్ని మెరుగుపరిచాయి. వస్తుసేవల పన్ను (జీఎస్టీ) మరింత సమగ్ర జాతీయ మార్కెట్‌ను సృష్టించి, అనేక పన్నులతో కూడిన సంక్లిష్ట వ్యవస్థను తొలగించింది. దివాలా చట్టం (ఐబీసీ) ద్వారా పెట్టుబడులు, ఉత్పాదక ఆస్తులను తిరిగి వినియోగించే చక్రం ఏర్పడింది. డిజిటలీకరణ, వ్యవస్థీకరణతో మరిన్ని ఆర్థిక కార్యకలాపాలు అధికారిక వ్యవస్థ పరిధిలోకి వచ్చాయి. నాలుగు కొత్త కార్మిక చట్టాలు అప్పటికే ఉన్న కార్మిక చట్టాలను ఏకీకృతం చేసి, హేతుబద్ధంగా మార్చాయి. ఈ మార్పులన్నీ వ్యాపార సంస్థల నిర్వహణను, వృద్ధిని సులభతరం చేశాయి. వస్తువుల రవాణాకు పట్టే సమయం, అయ్యే ఖర్చు భారత పరిశ్రమ ఎదుర్కొన్న సమస్యల్లో అత్యంత పాత సమస్య. మౌలిక సదుపాయాలపై ఎక్కువ ఖర్చుపెట్టడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభించింది. రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, విమానాశ్రయాలు, ఎక్స్‌ప్రెస్‌వేలు ఆర్థిక వ్యవస్థకు జీవనాడులుగా మారాయి. తూర్పు, పశ్చిమ ప్రత్యేక కారిడార్లు సరకు రవాణాకు వెన్నెముకగా నిలిచాయి. సొంత రవాణా వ్యవస్థలు, వాహన శ్రేణులను నిర్మించుకోలేని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఇది ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు, ప్రాంతాలతో కుదిరిన వాణిజ్య ఒప్పందాల ద్వారా భారత పరిశ్రమకు విదేశీ మార్కెట్లలోనూ విస్తృత అవకాశాలు లభించాయి. భారీ దేశీయ మార్కెట్‌కు తోడు ప్రపంచ మార్కెట్లలో పెరుగుతున్న అవకాశాలు భారత ఉత్పత్తిదారులకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నాయి. దశాబ్దం క్రితం కూడా ఇలాంటి వాతావరణాన్ని ఊహించడమే కష్టం అన్నట్టు ఉండేది. భారత్ పారిశ్రామిక ప్రస్థానంలో ‘ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక కార్యక్రమం’ (పీఎల్ఐ) ఒక ముఖ్య ఘట్టం. 14 రంగాల్లో రూ.2.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి హామీలతో పీఎల్ఐ పథకం దేశ తయారీ సామర్థ్యాన్ని విస్తరిస్తోంది. పెట్టుబడులను ఆకర్షిస్తూ ఉపాధిని సృష్టించి, విభిన్న పరిశ్రమల్లో ఎగుమతులను పెంచుతోంది. పారిశ్రామిక పునాది ఎంత వేగంగా మారగలదో ఎలక్ట్రానిక్స్ రంగం స్పష్టంగా చూపుతోంది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ, ఎగుమతులు రెండంకెలు, మూడంకెల స్థాయిలో పెరిగాయి. ప్రపంచంలోని ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్లు ప్రస్తుతం భారత్‌లో ఫోన్లను తయారు చేస్తున్నాయి. సెమీకండక్టర్ల తయారీ మరింత ప్రతిష్ఠాత్మకమైన ముందడుగు. దశాబ్దం క్రితం సెమీకండక్టర్ తయారీ రంగంలో భారత్ పాత్ర దాదాపు కనిపించేది కాదు. ఇప్పుడు మన దేశం చిప్‌ల తయారీతోపాటు, వాటికి అవసరమైన డిజైన్, తయారీ, ప్యాకేజింగ్, ముడిసామగ్రి, నైపుణ్యం వరకు అన్ని విభాగాలనూ అభివృద్ధి చేస్తోంది. మోదీ దార్శనికత విడివిడి కర్మాగారాలకు పరిమితం కాదు. ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ, విద్యుత్ వాహనాలు, రక్షణ రంగాల్లో భారత్ సామర్థ్యాలను బలోపేతం చేయడం వరకు విస్తరించింది. తయారీ సామర్థ్యం ఇప్పుడు జాతీయ భద్రతకు సంబంధించిన అంశంగా కూడా మారుతోంది. ఈ దృక్పథంతోనే మోదీ రక్షణ ఉత్పత్తుల తయారీని చూస్తున్నారు. స్వదేశీ పరిశోధన & అభివృద్ధితో రక్షణ సాంకేతికతను పెంచి, దేశీయ పరికరాలను ఉత్పత్తి చేసి ఈ రంగంలో భారత్‌ను ప్రపంచ సరఫరాదారుగా మార్చడంపై అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గత పన్నెండేళ్లలో రక్షణ ఎగుమతులు 56 రెట్లు పెరిగాయి. భారత పరిశ్రమ తదుపరి దశలో ప్రపంచ స్థాయి సంస్థలుగా ఎదగగల మధ్య తరహా కంపెనీలు మరెన్నో అవసరం. ఆవిష్కరణలకు మద్దతు ఇస్తూ కాలక్రమంలో సామర్థ్యాలను నిర్మించేందుకు సిద్ధంగా ఉండే పెట్టుబడిదారులు, సంస్థలు వాటికి కావాలి. అంకుర సంస్థలు, పరిశోధనలో పెట్టుబడులు ఇక్కడ కీలకపాత్ర పోషిస్తాయి. రక్షణ, అంతరిక్షం, డ్రోన్లు, అధునాతన సాంకేతిక రంగాల్లో కొత్త కంపెనీలు అడుగుపెడుతున్నాయి. గతంలో ఈ రంగాలు వాటికి అందుబాటులో ఉండేవి కావు, లేదా ప్రవేశానికి తీవ్రమైన అడ్డంకులు ఉండేవి. పారిశ్రామిక అభివృద్ధిపై మోదీ ఆసక్తి ఎలాంటిదో, పరిశ్రమల ప్రముఖులతో చర్చించేందుకు ఆయన ఎంత సుముఖంగా ఉంటారో, దశాబ్దాలుగా ఆయనను వ్యక్తిగతంగా గమనించిన నాకు అర్థమైంది. కంపెనీలు ఏం నిర్మిస్తున్నాయి, ఇతర దేశాలు ఏం చేస్తున్నాయన్న విషయాలపై ఆయన ఎంతో ఆసక్తి చూపుతారు.

విదేశీ పర్యటనల్లో ఆసక్తికరమైన అంశం కనిపిస్తే వెంటనే దాని గురించి భారత పారిశ్రామికవేత్తలతో చర్చిస్తారు. సంప్రదాయ పరిధులను దాటి ఆలోచించాలనీ, తమ కృషిని దేశ నిర్మాణంలో భాగంగా చూడాలనీ ఆయన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తారు. మోదీ 25 ఏళ్ల నాయకత్వం నుంచి ఒక విస్తృతమైన ఆలోచనా ధోరణి రూపుదిద్దుకుంటోంది. ఆయన పరిశ్రమను కేవలం ఆర్థిక కార్యకలాపంగా కాకుండా జాతీయ సామర్థ్యానికి ప్రతిరూపంగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత పరిశ్రమ మరింత ధైర్యంగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది. పరిశోధన, ఆవిష్కరణల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టాలి. స్వల్పకాలిక ఆర్థిక లాభాలకు బదులుగా దీర్ఘకాలిక దృక్పథాన్ని ప్రదర్శించాలి. వికసిత భారత్‌పై మోదీ దృష్టి భారత పరిశ్రమకు స్పష్టమైన పిలుపునిస్తున్నది. భారత్ అవసరాల కోసం ఉత్పత్తి చేయడమే కాక, ప్రపంచ స్థాయి సంస్థలుగా ఎదగాలని అది సూచిస్తోంది.

# ఆ రాజ్యాంగ రక్షకులు ఇప్పుడేరీ?

పోలీసు రాజ్యం అంటే ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే న్యూఢిల్లీకి రండి. ప్రభుత్వ నెలవులు, అమాత్యుల నివాసాలు ఉన్న రహదారులలో తిరిగేందుకు ప్రయత్నించండి! కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసం, ఎన్నికల కమిషన్ కార్యాలయం, పార్లమెంటు, జంతర్ మంతర్ చుట్టూ కొన్ని కిలోమీటర్ల వరకు పోలీసులు బారికేడ్లను నిర్మించి అడుగడుగునా మోహరించారు. ఐడీ కార్డులు చూపిస్తే కానీ మీడియా ప్రతినిధులను సైతం పోలీసులు అనుమతించడం లేదు. వాహనాలను ఎక్కడో ఒక చోట నిలిపేసి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. రోడ్లపై ప్రతి కొన్ని అడుగులకూ మైకులను ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అవి వింటే వెన్ను జలదరిస్తుంది. సైన్యంలో తిరుగుబాటును ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తే భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 160 కింద, ప్రభుత్వాధికారులు జారీ చేసే ఆదేశాలను ధిక్కరిస్తే సెక్షన్ 223 కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఆ మైకుల ద్వారా హెచ్చరిస్తున్నారు. ప్రదర్శనకారులకు దూరంగా ఉండాలని, పోలీసులు తీసుకునే చర్యలకు ఆటంకం కలిగించరాదని హెచ్చరిస్తున్నారు.

కోట్లాది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగిస్తున్నారని, ఓట్ల చోరీతో బీజేపీ గెలిచేందుకు దోహదం చేస్తున్నారని ఆరోపిస్తూ గాంధీ జయంతి రోజున కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్షాలు ఆందోళనను ప్రకటించినప్పటి నుంచీ ఇదే పరిస్థితి. మంగళవారం ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు నుంచి నిర్వాచన్ సదన్ (ఎన్నికల కమిషన్ కార్యాలయం)కు తలపెట్టిన ఊరేగింపును అడ్డుకునేందుకు ఈ భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ముంబైలో సీజేపీ నిర్వహించిన ధర్నాలో పదివేలమంది పాల్గొన్నప్పటికీ అది శాంతియుతంగా ముగిసింది. అయితే ఢిల్లీలో జంతర్ మంతర్ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించి, పెద్ద ఎత్తున బలగాల్ని రప్పించడం ఒక యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. దేశ రాజధానిలో నిరసన ప్రదర్శనలకు అనుమతిస్తే అవి ఉధృతం కాకుండా అడ్డుకోవడం కష్టమని ప్రభుత్వం గ్రహించినట్లు కనిపిస్తోంది. పరిస్థితి ఇలా తీవ్రతరమయ్యేందుకు ప్రభుత్వం అసలెందుకు కారణమవుతోంది? 2024లో మూడోసారి 240 సీట్లు మాత్రమే గెలుచుకుని అధికారంలోకి వచ్చేందుకు మిత్రపక్షాల సహాయం తీసుకోవాల్సి వచ్చినప్పటి నుంచీ మోదీ ప్రభుత్వం ఆత్మరక్షణలో పడినట్లు కనపడుతోంది. ఆ తర్వాత జరిగిన ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించిన తీరుపై ప్రజల్లో అనుమానాలు రేకెత్తించడంలో ప్రతిపక్షాలు విజయవంతమయ్యాయి. ప్రతిపక్షాలనైతే దేశ వ్యతిరేకులని నిందించేందుకు అవకాశమున్నది. అయితే ఇప్పుడు నిరసన ప్రతిపక్షాల పరిధిని దాటిపోయింది. కాక్రోచ్ జనతా పార్టీ అవతరించిన తర్వాత లక్షల సంఖ్యలో యువజనులు ప్రతిస్పందిస్తున్న తీరు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు వారికి తోడుగా న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు, మాజీ ఎన్నికల కమిషనర్లు, అనేక ఇతర వర్గాలు చేరడంతో ప్రభుత్వ వ్యతిరేకత పెల్లుబుకుతోంది. ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష చర్యలను నిరసిస్తూ ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సైతం అనేక అంతర్గత నోట్‌లను లిఖితపూర్వకంగా సమర్పించారన్న వార్త ఇటీవల బయటకు పొక్కడంతో పరిణామాలు మరో మలుపు తిరిగాయి. ఆటో డ్రైవర్లు, ఇతర సామాన్య వర్గాల్లో కూడా బీజేపీ ఎన్నికల విజయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ‘మేము బెంగాల్‌లో మమతా బెనర్జీ అరాచక పాలనపై పోరాడి విజయం సాధించాం. అయినప్పటికీ మాది నిజమైన విజయం అని చెప్పుకోలేకపోతున్నాం’ అని బీజేపీ సీనియర్ నాయకుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ఇంతదాకా రావడానికి ప్రధాన కారణం వ్యవస్థలను తన గుప్పిట్లో ఉంచుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించడమేనని గట్టిగా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.. ప్రత్యర్థులను తుడిచిపెట్టేందుకు ఈడీ, సీబీఐ మొదలైన దర్యాప్తు సంస్థలను ఎడా పెడా ప్రయోగించడం, తమతో చేతులు కలిపిన నేర చరితులను చట్టం నుంచి రక్షించడం, సీవీసీ, కాగ్‌లను నామమాత్ర సంస్థలుగా మార్చడం మొదలైన రాజ్యాంగ విరుద్ధ చర్యలకు ప్రస్తుత పాలకులు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. సమాచార హక్కును నీరుగార్చినప్పుడే వ్యవస్థల పనితీరుపై గౌరవం తగ్గిపోయింది.

## న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ బార్ అసోసియేషన్ ధర్నా

### దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్.






**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** న్యాయవాది వై.ఆర్. మల్లికార్జున రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి, దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. న్యాయవాదులపై దాడులను అడ్డుకోవడంతో పాటు, న్యాయవాదులకు రక్షణ కల్పించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు స్పష్టం చేశారు.

## విధినిర్వహణలో ప్రతిభాకు ప్రశంసలు

### ఎస్ఐ కె. మల్లికార్జున, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లకు కోర్టు అభినందన సర్టిఫికెట్లు



**జూపాడుబంగ్లా, అక్టోబర్:7 (నంది పత్రిక)** విధి నిర్వహణలో సమర్థవంతముగా పనిచేసిన ఎస్ఐ కే. మల్లికార్జున, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు కోర్టు అధికారులు అభినందించారు. జే ఎఫ్ సి ఎం కేసుల దర్యాప్తు, న్యాయస్థానం ప్రక్రియలో బాధ్యతాయుతముగా వ్యవహరించినందుకు వారి సేవలను గుర్తిస్తూ అభినందన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కోర్టు అధికారులు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయడం అభినందనీయమన్నారు. కోర్టు నుంచి అభినందనలు సర్టిఫికెట్లు అందుకోవడం పోలీస్ సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సేవలను కోర్ట్ అధికారులు ప్రశంసించారు.

## దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..

దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు) , ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజీఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది. ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10,16,17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25,26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా దసరా కు నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ రెగ్యులర్ , స్పెషల్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి స్పష్టం చేశారు. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ ను వెబ్ సైట్ లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. దసరా కు స్వంత ఊర్లకు వెళ్లే ప్రయాణీకులు ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని యాజమాన్యం సూచించింది.

## తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్

తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com